ఏఎన్ఎంలపై పనిభారం తగ్గించాలి!





గద్దర్ ఆశయాలను కొనసాగించాలి!




PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 222 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 07 ఆగస్టు 2026



## 1.05 కోట్ల కొత్త, ల్యామినేటెడ్ రేషన్ కార్డులు

**అర్హులకు ఆహార భద్రతను విస్తరించడమే లక్ష్యం**

**పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి**

**హైదరాబాద్,ఆగస్టు 6(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో నూతన పీడీఎస్ రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం తుది ముహూర్తం ఖరారు చేసింది. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నూతన రేషన్ కార్డుల పంపిణీ పక్రియను ప్రారంభించనున్నట్లు పౌరసరఫరాల శాఖ

మిగతా2లో...

# సింగరేణి చరిత్రలో మరో మైలురాయి

**● నైనీ గనుల నుంచి థర్మల్ విద్యుత్ కేంద్రానికి బొగ్గురాక ● రజైపూర్ వద్ద రైలుకు స్వాగతం పలికిన అధికారులు ● బొగ్గు రాకపై డిప్యూటి సిఎం భట్టి ఆనందం**



**మంచిర్యాల,ఆగస్టు 6(పిసిడబ్ల్యూ న్యూస్):** సింగరేణి చరిత్రలో మరో మైలురాయి చేరింది. ఒడిశాలోని సింగరేణి నైనీ గని నుంచి తొలి బొగ్గు రైల్వే వ్యాగన్ తెలంగాణకు చేరింది. మంచిర్యాల జిల్లా జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రానికి బొగ్గు రైలు చేరుకుంది. సింగరేణి అధికారులు రైలుకు ఘన స్వాగతం పలికారు. 59 వ్యాగన్ల ద్వారా 4 వేల టన్నుల జీ-10 గ్రేడ్ బొగ్గు వచ్చింది. ఈసందర్భంగా సింగరేణి యాజమాన్యం, కార్మికులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

మిగతా2లో...



## సచివాలయం ప్రాంగణంలో ఘనంగా బోనాల ఉత్సవాలు

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి**

**హైదరాబాద్,ఆగస్టు 6(పిసిడబ్ల్యూ న్యూస్):** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గురువారం సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

మిగతా2లో...

## కృష్ణా నీటి వాటాలను తేల్చండి

**అమరావతి,ఆగస్టు 6(పిసిడబ్ల్యూ న్యూస్):** కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఛైర్మన్‌కు ఏపీ ప్రభుత్వం లేఖ రాసింది. కృష్ణా జలాల అంశంపై చర్చించేందుకు బోర్డు సమావేశం ఏర్పాటు చేయాలని రాష్ట్ర జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కోరారు. శ్రీశైలం, సాగర్‌లో అందుబాటులో ఉన్న నీటిలో ఏపీ,

మిగతా2లో...




**- బోర్డు సమావేశం ఏర్పాటు చేయాలని కోరిన ఎపి**

## అగ్ని-4 పరీక్ష విజయవంతం

**భువనేశ్వర్,ఆగస్టు 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారత్ మరో కీలక క్షిపణి పరీక్షను విజయవంతంగా పూర్తి చేసింది. అగ్ని-4 బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా ప్రయోగించింది. ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ పరీక్షా కేంద్రం నుంచి విజయవంతంగా ప్రయోగించినట్లు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ గురువారం (ఆగస్టు 6) వెల్లడించింది ఈ ప్రయోగాన్ని స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ ఆధ్వర్యంలో

మిగతా2లో...



# విద్య వ్యాపార వస్తువుగా మారింది

**- ఎల్‌కెజికే లక్షల్లో ఫీజులు దండుకుంటున్నారు**

**- నిరుద్యోగం, ఫీజుల దోపిడీ,ప్రభుత్వ వ్యవస్థల నిర్వీర్యంపై పోరు**

**- క్యా బోల్తీ పబ్లిక్ పేరిట...దేశ వ్యాప్త పర్యటనలు**

**- ఫ్రెజర్ గ్రూపుగా పనిచేసేందుకే నిర్ణయం**

**- కాక్రోచ్ జనతా పార్టీవ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే**



**ముంబై,ఆగస్టు 6 (పిసిడబ్ల్యూ న్యూస్):**కాక్రోచ్ జనతా పార్టీవ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే దేశవ్యాప్తంగా 'క్యా బోల్తీ పబ్లిక్' అంటే ప్రజలు ఏమంటున్నారు... పేరుతో కొత్త ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. నిరుద్యోగం, విద్యా సంస్కరణలు, సామాజిక న్యాయం వంటి అంశాలను ప్రజల వద్దకు తీసుకెళ్తామని ఆయన తెలిపారు. విద్యార్థి నిరసనలతో దేశం దృష్టి

మిగతా2లో...



## బయోగ్యాస్ ఉత్పత్తికి ప్రోత్సాహం

**- రూ.23,731 కోట్ల 'గోబర్ధన్ పథకం**

**- కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయం**

**న్యూఢిల్లీ,ఆగస్టు 6 (పిసిడబ్ల్యూ న్యూస్):**ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన గురువారం కేంద్ర మంత్రి మండలి సమావేశం జరిగింది. ఈ కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులకు ప్రధాని దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు కేంద్ర కేబినెట్‌లో ప్రధాని మోదీ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బయోగ్యాస్ ఉత్పత్తిని ప్రోత్సహించాలని నిర్ణయించారు. రూ.23,731 కోట్ల '

మిగతా2లో...

### తెలంగాణ కోసం కడవరకు తపించిన

# జయశంకర్ సార్

**• కెసిఆర్ పట్టుదలపై నమ్మకంతో వెన్నంటి వచ్చారు**

**• జయంతి సభలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్**



**హైదరాబాద్,ఆగస్టు 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్‌కు మించి దక్షత, కమిట్‌మెంట్, తెలంగాణ సాధించాలనే మొండితనం ఉన్న నాయకుడిని ఒక్కరిని చూపించండి.. నేను మీ వెంబడి నడుస్తా అని అనేవారని, ఆయన మొహమాటం కూడా పడేది కాదని గుర్తు చేసుకున్నారు.దేవేందర్ గౌడ్ పార్టీ పెడితే వెళ్లి మీరు పోవొద్దు సార్ కేసీఆర్‌తో అసోసియేట్ అయి ఉన్నరని అంటే జయశంకర్ సార్ ఒక మాట చెప్పిండు.. ఎన్ని పార్టీలు వస్తే అంత మంచిది ఏం కాదు.. తెలంగాణ రాష్ట్రం రావాలే.. ఆ రాష్ట్రం వచ్చే క్రమంలో

మిగతా2లో...

# ఇందిరమ్మ ఇళ్లు పేదలకు వరం

**- గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి**



**ఖమ్మం,ఆగస్టు 6 (పిసిడబ్ల్యూ న్యూస్):**ల్లా ఏదులాపురం మున్సిపాలిటీ గుదిమళ్లలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇందిరమ్మ ప్రభుత్వం పేదల పక్షాన నిలబడుతుందని స్పష్టం చేశారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆసరా పెన్షన్లు అందజేస్తామని ఆయన కీలక ప్రకటన చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం, అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి నెలకు నిర్ణీత ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వ పథకం ద్వారా వృద్ధులు, విధవలు, నేత కార్మికులు, కల్లు గీత కార్మికులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, ఎయిడ్స్ బాధితులకు నెలకు రూ. 2,016 చొప్పున పింఛను అందజేస్తున్నారు. అలాగే దివ్యాంగులకు, తీవ్రమైన శారీరక రుగ్మతలు ఉన్నవారికి నెలకు రూ. 4,016 లభిస్తోంది. అంతేకాకుండా ÷ల్గ÷లేరియా బాధితులకు కూడా ప్రతి నెలా రూ. 2,016 ఆర్థిక సాయం అందుతోంది. సమగ్ర భూ సర్వే చేపట్టి 'భూ భారతి' ద్వారా లబ్దిదారులకు డిజిటల్ మ్యాప్‌తో సహా భూమి హక్కు పత్రాలు అందజేసే బాధ్యతను

మిగతా2లో...




## విద్యార్థులతో రాహుల్ సభకు ఆటంకం

**- అనుమతి రద్దుపై మండిపడ్డ రాహుల్**



## జయశంకర్ సార్‌కు సిఎం రేవంత్ నివాళి

**హైదరాబాద్,ఆగస్టు 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. సిద్ధాంతకర్తగా తెలంగాణ

మిగతా2లో...

# సింగరేణి చరిత్రలో మరో మైలురాయి

(మొదటి పేజీ తరువాయి)

శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి చరిత్రలో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైందన్నారు. మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ కి ఒడిశాలోని నైనీ బ్లాక్ నుంచి బొగ్గు చేరుకుంది. ఈ పరిణామపం పట్ల తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. ఇది చారిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. గురువారం ఈ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు నైనీ బ్లాక్ నుంచి బొగ్గు లోడ్‌తో రైల్వే వ్యాగన్ వచ్చింది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించారు. రాష్ట్రంలో విద్యుత్ లోటు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు తమ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. దేశ అవసరాలకూ సింగరేణి బొగ్గు కీలకమని గుర్తు చేశారు. కొత్త కోల్ బ్లాకుల కోసం ప్రయత్నాలు కొనసాగుతాయని తెలిపారు. సింగరేణిని కాపాడుకుంటామని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. నైనీ గనుల నుంచి బొగ్గు రాకతో సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు ఆ కొరత తీరిందని వివరించారు. సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ కి రైలు వ్యాగిన్ చేరుకోగానే.. ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. 9 బాక్స్ వ్యాగన్లలో మొత్తం 4,000 టన్నుల జీ–10 రకం బొగ్గు ఒడిశాలోని నైనీ గని నుంచి గురువారం ఉదయం జైపూర్‌కు చేరుకుంది. సింగరేణి కాలరీస్ నుంచి 136 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా రాష్ట్రం వెలుపల ఉన్న గని నుంచి బొగ్గు ఉత్పత్తిని సాధించి సొంత థర్మల్ ప్లాంట్‌కు రవాణా చేయడం ఇదే తొలిసారి. ఈ ప్రాజెక్టు విజయవంతం కావడం వెనుక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అలుపెరగని కృషి, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. అనుమతుల సాధనలో ఎదురైన ఎన్నో అడ్డంకులను పటాపంచలు చేస్తూ ఈ విజయాన్ని సొంతం చేసుకున్నారని పేర్కొంది. అనుమతుల కోసం భట్టి విక్రమార్క స్వయంగా రెండుసార్లు ఒడిశా పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. 2024 జులైలో ఒడిశా ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులతో సానుకూల వాతావరణంలో చర్చలు జరిపి, ఆటంకాలన్నీ తొలగించారని సర్కార్ స్పష్టం చేసింది. అనంతరం 2025 ఏప్రిల్ 16న నైనీ గనిలో బొగ్గు ఉత్పత్తిని వర్చువల్ విధానంలో డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ఆ శ్రమ ఫలితంగా నైనీ గని నుంచి బయలుదేరిన తొలి రైలు 1,131 కిలోమీటర్లు ప్రయాణించి తెలంగాణ గడ్డపైకి చేరుకుంది. 59 బాక్స్ వ్యాగన్ల ద్వారా ఏకంగా 4 వేల టన్నుల అత్యుత్తమ జీ–10 గ్రేడ్ నాణ్యమైన బొగ్గు సింగరేణి థర్మల్ కేంద్రానికి చేరింది. కేంద్ర బొగ్గు శాఖ 2015 ఆగస్టు 13న సింగరేణికి కేటాయించిన ఈ నైనీ గని, మొత్తం 340.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ గని జీవితకాలం 36 సంవత్సరాలు కాగా, ఏడాదికి కోటి టన్నుల (10 మిలియన్ టన్నులు) ఉత్పత్తి సామర్థ్యంతో నడవనుంది. నైనీ నుంచి నాణ్యమైన బొగ్గు రాకతో తెలంగాణ విద్యుత్ ఉత్పత్తిలో ఇకపై ఎలాంటి ఆటంకాలు ఉండవని, భవిష్యత్తు తరాలకు నిరంతర ఉచిత, నాణ్యమైన విద్యుత్ అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని స్పష్టమవుతోంది. సింగరేణి కీర్తి కిరీటంలో ఈ నైనీ బొగ్గు గని మరో వజ్రంగా నిలిచిపోనుంది.

# తెలంగాణ కోసం కడవరకు తపించిన జయశంకర్ సార్

(మొదటి పేజీ తరువాయి)

నేను వాళ్లకు తెలంగాణ కోసం స్పర్థ లేకుండా, సమానంతరంగా పనిచేయండి.. ఒకరికి ఒకరు కలహించుకోకండి.. ఎవరు చేసిన అల్టిమేట్‌గా మీరందరూ కోరుతున్నది తెలంగాణెళి కదా..చెప్పి వస్తన్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఎన్ని కొత్త పార్టీలు పుట్టినా, వారికి తాత్కాలిక భావసారూప్యత లేకపోయినా, లక్ష్యసారూప్యత ఉండాలని బలంగా వాదించిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో మళ్లీ నీళ్లకు అన్యాయం చేసే ప్రయత్నం జరుగుతుందని కేటీఆర్ తెలిపారు. తెలంగాణకు సంబంధించిన 7 ప్రాజెక్టులను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఏపీ ప్రభుత్వం అడుగుతుంది. ఢిల్లీ పార్టీ చేతుల్లో జుట్టు ఉంటే వాళ్లు ఆడించినట్లే ఆడాలి. అదే తెలంగాణ కోసం పుట్టిన పార్టీ అధికారంలో ఉంటే ఆ పరిస్థితి ఉంటుందా..? అని కేటీఆర్ అడిగారు. లోక్‌సభలో తెలంగాణ విభజనను పాకిస్తాన్‌తో పోలిస్తే ఒక్క బీజేపీ, కాంగ్రెస్ ఎంపీ అయినా మాట్లాడిండా..? అదే మనవాడు ఉంటే గల్లా పట్టి అడిగేవాడని అన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత 75వ సారి ఇవాళ ఆయన ఢిల్లీలో ఉన్నడు. ముఖ్యమంత్రి అయి 32 నెలలు కూడా కాలేదు.. రేపటితోనో, ఎల్లుండితోనో అవుతయి. కానీ 13 రోజులకోసారి ఢిల్లీ పోతడు.. 2,3 రోజులు అక్కడ ఒంటడు. దేహీ దేహీ అని ఈ రోజు అక్కడ యాచిస్తున్నడు. అందుకే జయశంకర్ సార్ ఢిల్లీకి సామంతులుగా ఉండొద్దు.. స్వతంత్రులుగా ఉండాలే అని కోరుకున్నరని అన్నారు. ఎన్నటికైనా స్వీయ రాజకీయ అస్థిత్వమే తెలంగాణకు శ్రీరామ రక్ష. తెలంగాణ కోసం ఒక స్వీయ రాజకీయ అస్థిత్వ పతాక ఉండాలే. ఎన్నటికైనా తెలంగాణ కోసం ఎలాంటి రాజీ లేకుండా ఎవరితో కాంప్రమైజ్ కాకుండా గొంతు విప్పితే ఒక సింహం లాగా గర్జించే విధంగా కేసీఆర్ తీరుగా గొంతు ఉండాలే.. అందుకే కాంగ్రెస్‌లో కలవొద్దు అని గట్టిగా వాదించిన నాయకుడు, మహానుభావుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని కేటీఆర్ అన్నారు.

# బస్తీలో కుస్తీ ఢిల్లీలో దోస్తీ

**బీసీలను మభ్యపెడుతున్న కాంగ్రెస్, బీజేపీ**

**బీసీ బిల్లుకు చట్టబద్ధత వచ్చే వరకు**

**పల్లె నుంచి ఢిల్లీ దాకా పోరాటం: టీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల కవిత**

**దిల్‌సుఖ్‌నగర్,ఆగస్టు 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హైదరాబాద్ బస్తీల్లో కుస్తీ.. ఢిల్లీ గల్లీల్లో దోస్తీ చేస్తున్నారని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో గురువారం టీఆర్ఎస్ (తెలంగాణ రక్షణ సేన) ఆధ్వర్యంలో 'సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ.. బీసీ రిజర్వేషన్లపై క్రెడిట్ కొడదామనుకున్న సీఎం రేవంత్ రెడ్డి.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ద్వారా పార్లమెంట్‌లో చట్టం చేయించొచ్చుని, అలా చేయకుండా బీసీలను మభ్యపెడుతున్నారని అన్నారు.

తెలంగాణలో బీసీల జనాభా 60 శాతానికి పైగా ఉంటే, రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 42 శాతానికే పరిమితం చేయడం ఎందుకని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుకు చట్టబద్ధత కల్పించకుండా అన్ని పార్టీల అగ్రవర్ణ నాయకులు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు ఉన్నట్టే బీసీలకు కూడా రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ బిల్లు చట్టబద్ధత వచ్చే వరకు తెలంగాణ రక్షణ సేన పల్లె నుంచి పట్టణం దాకా, హైదరాబాద్ గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరుబాట పడుతుందని స్పష్టం చేశారు.సామాజిక తెలంగాణ కోసం రాజకీయాలకతీతంగా బీసీలకు బేషరతుగా అందరూ మద్దతు తెలపాలన్నారు. సామాజిక ఉద్యమాలకు నాంది పలికిన సాహుల్ మహారాజు, సిద్ధార్థుడు, మహాత్మ జ్యోతిబా ఫూలే, అంబేద్కర్ తదితరుల ఆశయాల సాధన కోసం టీఆర్ఎస్ రాజీలేని పోరాటం చేస్తుందని చెప్పారు. అగ్ర కులాలే కాదు అణగారిన తరగతుల్లోనూ అధిక సంపన్నులు ఉన్నారని, అయితే అటువంటి వారితో ఆయా తరగతులకు కూడా న్యాయం జరగడం లేదని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో కొంతమంది సంపన్ను లున్నా 90 శాతం మంది పేదరికం అనుభవిస్తున్నారని తెలిపారు. మైనారిటీలు, క్రైస్తవులకు హక్కులు, సంక్షేమం కోసం పాలకులు కృషి చేయాలని డిమాండ్ చేశారు.

# విద్య వ్యాపార వస్తువుగా మారింది

(మొదటి పేజీ తరువాయి)

ఆకర్షించిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కీలక ప్రకటన చేసింది. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు 'క్యా బోల్తీ పబ్లిక్' పేరిట జాతీయస్థాయి ప్రచారం నిర్వహిస్తామని వెల్లడించింది. ప్రజల ఆందోళనలు, ఆకాంక్షలను అర్థం చేసుకోవడం, అభిప్రాయాలను తీసుకోవడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని స్పష్టం చేసింది. సెప్టెంబర్ నుంచి దేశవ్యాప్తంగా పర్యటించి ప్రతి ఒక్కరితోనూ మమేకమవుతామని తెలిపారు. సీజేపీ ఒక రాజకీయ పార్టీగా మారకుండా ఒక ఒత్తిడి బృందంగానే కొనసాగుతుందని దీప్కే ప్రకటించారు. మహారాష్ట్రలో నిర్వహించిన పార్టీ ప్రధాన బృంద సమావేశం అనంతరం దీప్కే ఈ ప్రకటన చేశారు. ప్రస్తుతం ఎన్నికల్లో పోటీ చేయాలనే ఉద్దేశం లేదని, ప్రజల తరఫున ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చే ప్రెషర్ గ్రూప్‌గా పనిచేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. దేశ యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్య, ప్రైవేట్ విద్యాసంస్థల అధిక ఫీజులు, ప్రభుత్వ పాఠశాలల నాణ్యత, ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజల్లో తగ్గుతున్న విశ్వాసం వంటి అంశాలపై ఉద్యమాన్ని మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ ప్రచారంలో విద్యార్థులు, యువత, సాధారణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ రోజు మన దేశంలో సంస్థాగత జవాబుదారీతనం ప్రమాదకర స్థితిలో ఉంది. ఇది మన ప్రజాస్వామ్యానికి ఒక ప్రమాదకర సంకేతం. గతంలో ఓటర్లు ప్రభుత్వాన్ని ఎన్నుకునేవారు. ఈ రోజు ఎవరు ఓటు వేయాలో ప్రభుత్వమే నిర్ణయిస్తోంది. ప్రజాస్వామ్యం ఇలా పనిచేయదు. మనం ఎన్నికల సంఘం జవాబుదారీతనాన్ని సరిదిద్దాలి. మనం ఇది చేసేంత వరకు దేశంలో ఎన్నికల అవకతవకలు కొనసాగుతాయి' అని దీప్కే పేర్కొన్నారు. నిరుద్యోగం దేశంలో ఒక ప్రధాన సమస్య అని, దీనిని దేశవ్యాప్త సమస్యగా పరిగణిస్తామని దీప్కే తెలిపారు. భారతీయ కుటుంబాలకు నాణ్యమైన విద్య రోజురోజుకూ భారంగా మారుతోందని, అందుకే ఆ అంశంపైనే తొలుత తాము దృష్టిసారిస్తామని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తెలిపారు. సెప్టెంబర్ నుంచి ప్రజల్లోకి వెళ్తామని మీడియా వేదికగా తెలియజేశారు. ఒకటో తరగతికే ఫీజులు రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు చెల్లించాల్సి వస్తోంది. కొన్ని పాఠశాలల్లో ఇంకా ఎక్కువే ఫీజులు ఉంటున్నాయి. మధ్యతరగతి కుటుంబాలు ఆ మొత్తాన్ని ఎలా భరిస్తాయి. ఈ ఖర్చుల వల్ల ప్రజలు అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తోంది.

రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ చెప్పిన ప్రకారం.. విద్య ప్రాథమిక హక్కు. గత కొన్నేళ్లుగా అది ఒక వ్యాపారంగా మారిపోయిందని దీప్కే ఆందోళన వ్యక్తంచేశారు. తమ ప్రచారంలో పాల్గొనాలనుకునేవారు అధికారిక క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయాలని సూచించారు. ఆ క్యూఆర్ కోడ్‌లను మీడియా సమావేశంలో ప్రదర్శించారు. సభ్యత్వం పూర్తిగా ఉచితమని చెప్పారు. మోసపూరిత చెల్లింపు అభ్యర్థనల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యవస్థలు ప్రజలకు జవాబుదారీగా ఉండేలా... ఒత్తిడి తెచ్చే సంస్థగా సీజేపీ పనిచేస్తుందని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. రాజకీయ పార్టీల పరిస్థితి దారుణంగా ఉంది. ప్రజలు ఉదయం ఒక పార్టీకి ఓటేస్తే సాయంత్రంకల్లా మరో పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని ఆయన అన్నారు.

# విద్యార్థులతో రాహుల్ సభకు ఆటంకం

**- అనుమతి రద్దుపై మండిపడ్డ రాహుల్**

**న్యూఢిల్లీ,ఆగస్టు 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో విద్యార్థులతో రాహుల్ గాంధీ నిర్వహించాల్సిన సమావేశానికి అనుమతి రద్దు కావడం వివాదంగా మారింది. ఆగస్టు 8న జరగాల్సిన 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమానికి రెండు రోజుల ముందే వేదిక అనుమతిని రద్దు చేశారు.

ఈ కార్యక్రమం జరగాల్సిన కేపీ గ్రౌండ్ యజమాని అయిన కాయస్థ పాఠశాల ట్రస్ట్.. అలహాబాద్ హైకోర్టు ఆదేశాలను కారణంగా చూపిస్తూ అనుమతిని వెనక్కి తీసుకుంది.

'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమానికి అనుమతి రద్దు చేయడంపై రాహుల్ గాంధీ ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. తనను అడ్డుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అయితే, తనను ఎవరూ ఆపలేరని, విద్యార్థుల సమస్యలపై తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అలహాబాద్ విశ్వవిద్యాలయంలో ఫీజుల పెంపు, సీట్ల తగ్గింపుకు వ్యతిరేకంగా విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం పోరాడుతున్నారని రాహుల్ తెలిపారు. వారి సమస్యలను వినకుండా వారిపై కేసులు పెడుతు న్నారని ఆరోపించారు.

యువత గొంతును అణచివేయడమే ప్రభుత్వ విధానమని, ప్రశ్నిస్తే లాఠీ దెబ్బలు, నిరసన చేస్తే కేసులు, మాట్లాడితే కఠిన చర్యలు తీసుకుంటున్నారని రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకోవడానికి తాను ప్రయాగ్‌రాజ్‌కు రావాలని నిర్ణయిం చుకున్నప్పటి నుంచి తన కార్యక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. విద్యార్థుల గొంతుకు ప్రభుత్వం భయపడుతోందని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా విద్యార్థులకు అండగా ఉంటానని రాహుల్ స్పష్టం చేశారు.

# కృష్ణా నీటి వాటాలను తేల్చండి

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ వాటాలు ఖరారు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా నీటిని జాగ్రత్తగా వాడుకోవాల్సిన అవసరముందని ఏపీ ప్రభుత్వం అభిప్రాయపడింది. రెండు రాష్ట్రాలకు నీటి కేటాయింపులపై చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరింది. నీటి వాటాల సింగిల్ పాయింట్ అజెండాతో సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. బోర్డు లేదా త్రిసభ్య కమిటీ సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేసింది.

# అగ్ని-4 పరీక్ష విజయవంతం

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. పరీక్ష సందర్భంగా క్షిపణికి సంబంధించిన అన్ని ఆపరేషనల్, సాంకేతిక ప్రమాణాలను విజయవంతంగా అందుకున్నట్లు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. అగ్ని శ్రేణి క్షిపణులు భారత వ్యూహాత్మక రక్షణ సామర్థ్యంలో కీలకమైనవి. అగ్ని–4 సుమారు 4,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను చేరుకోగల సామర్థ్యం కలిగిన బాలిస్టిక్ క్షిపణి.

# బయోగ్యాస్ ఉత్పత్తికి ప్రోత్సాహం

(మొదటి పేజీ తరువాయి)

గోబర్ధన్' జాతీయ సర్క్యులర్ బయోఎనర్జీ పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. 2026–27 నుంచి 2035–36 వరకు కేంద్రం అమలు చేయనుంది. వ్యవసాయ అవశేషాలు, పశువుల పేడ, సేంద్రీయ వ్యర్థాలతో కంప్రెస్డ్ బయోగ్యాస్ (అఃఉ) ఉత్పత్తి చేయనుంది. దేశీయ అఃఉ ఉత్పత్తిని దాదాపు పది రెట్లు పెంచడమే లక్ష్యమని కేంద్ర మంత్రులు తెలిపారు. దిగుమతి సహజవాయువుపై ఆధారాన్ని తగ్గించి ఇంధన భద్రతకు బలం చేకూర్చనుందని వెల్లడించారు. రైతులు, గ్రామీణ పారిశ్రామికవేత్తలు, సహకార సంఘాలకు కొత్త ఆదాయ అవకాశాలు వస్తాయని మంత్రులు పేర్కొన్నారు. అస్సాంలో నాలుగు లేన్ల నేషనల్ హైవేకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. రూ. 8,970 కోట్లతో అస్సాంలో నేషనల్ హైవే నిర్మించాలని మంత్రులు ఆమోదించారు.

# జయశంకర్ సార్‌కు సిఎం రేవంత్ నివాళి

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ పాత్ర అత్యంత కీలకమైందని అన్నారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జీవితాంతం అహర్నిశలు శ్రమించిన మహనీయుడని ఆయన కొనియాడారు.ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాల సాధనకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# 1.05 కోట్ల కొత్త, ల్యామినేటెడ్ రేషన్ కార్డులు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. అర్హులకు ఆహార భద్రతను విస్తరించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ బృహత్తర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1.05 కోట్ల కొత్త, ల్యామినేటెడ్ రేషన్ కార్డులను అర్హులకు అందించనున్నారు. సంగారెడ్డి జిల్లాలో ముఖ్యమంత్రి స్వయంగా ఈ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనుండగా, అదే సమయంలో రాష్ట్రంలోని అన్ని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో పంపిణీ ప్రక్రియ మొదలవుతుంది. స్వాతంత్ర్య దినోత్సవం రోజున మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు ఈ పంపిణీ కార్యక్రమాలు సాగుతాయి. కార్యక్రమం సజావుగా సాగేందుకు ప్రతి నియోజకవర్గంలో పంపిణీ పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం ఆర్డీవోలకు అప్పగించింది. స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ఈ వేడుకలు జరగనున్నాయి. కార్డుల సేకరణకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేదికల వద్ద మౌలిక వసతులు, తాగునీరు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పంపిణీ పూర్తయిన వెంటనే సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని స్పష్టమైన సూచనలు జారీ చేశారు.

# సచివాలయం ప్రాంగణంలో ఘనంగా బోనాల ఉత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)


శ్రీ సంజయ్ జాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సచివాలయ ఆవరణలోని శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయంలో నిర్వహించిన పూజల్లో ప్రధాన కార్యదర్శి పాల్గొని రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు సంప్రదాయబద్ధంగా బోనాలను సమర్పించగా, పోతరాజుల విన్యాసాలు, డప్పుల వాయిద్యాలు, వివిధ వేషధారణలతో కళాకారుల ప్రదర్శనలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, అధికారులు ఉత్సవాల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో సుభిక్షం, శాంతి, అభివృద్ధి నెలకొనాలని ఆకాంక్షించారు.

# ఇందిరమ్మ ఇళ్లు పేదలకు వరం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వమే తీసుకుంటుందని మంత్రి హామీ ఇచ్చారు. అనర్హుల వద్ద ఉన్న పాస్ పుస్తకాలను రద్దు చేస్తామని, అర్హులైన పేదలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగనివ్వమని స్పష్టం చేశారు. అలాగే రెండు మూడు రోజుల్లోనే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను ప్రారంభిస్తామని పేర్కొన్నాడు. అంతే కాకుండా.. రాబోయే మొదటి పంటకే సాగునీరు అందిస్తామని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యం పేదల భరోసా కోసం నిరంతరం శ్రమిస్తుందని ప్రజలు ఎవరూ అధైర్యపడకూడదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు.

# కొత్త తెల్ల రేషన్ కార్డులకు ముహూర్తం ఖరారు




**హైదరాబాద్,ఆగస్టు 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో తెల్లరేషన్ కార్డుల పంపిణీకి ముహూర్తం ఖరారైంది. ఆగస్టు 15 నుంచి కొత్త తెల్ల రేషన్ కార్డుల పంపిణీ చేయనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.అర్హులైన 1.05 కోట్ల మంది పేదలకు కొత్త రేషన్‌కార్డులు ఇవ్వనున్నట్లు వివరించారు. ఆగస్టు 15న సంగారెడ్డిలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రేషన్‌కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. అదే రోజున మొత్తం 119 నియోజకవర్గాల్లో ఒకేసారి రేషన్‌కార్డులు పంపిణీ చేస్తామని వెల్లడించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందిస్తామని చెప్పారు.

# ఏఎన్ఎంలపై పనిభారం తగ్గించాలి!

### పెండింగ్ రిక్రూట్‌మెంట్‌ను వెంటనే పూర్తి చేయాలి!

### కోఠి కమిషనరేట్ ముందు తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ 'మహా ధర్నా'

### కమిషనర్‌కు వినతిపత్రం అందజేత




**హైదరాబాద్,ఆగస్టు 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** వైద్య ఆరోగ్యశాఖలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంపీహెచ్ఏ (ఫిమేల్), ఏఎన్ఎంలపై పనిభారాన్ని తక్షణమే తగ్గించాలని మరియు గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 1931 ఏఎన్ఎం పోస్టుల రెగ్యులర్ రిక్రూట్‌మెంట్‌ను పూర్తి చేయాలని 'తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్' డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం రోజున హైదరాబాద్‌లోని కోఠి ఆరోగ్యశాఖ కమిషనర్ కార్యాలయం ముందు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన వందలాది మంది ఏఎన్ఎంలతో కలిసి మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు భూపాల్, ప్రధాన కార్యదర్శి కె.యాద నాయక్ మాట్లాడుతూ... క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు: మాతా శిశు సంరక్షణ, ఎన్‌సిడి, వ్యాక్సినేషన్ ఇలా ప్రతి సేవకు ఆయుష్మాన్ భారత్ ఖాతా (ఆభా) లింకింగ్ తప్పనిసరి చేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పెరుగుతున్న సైబర్ నేరాల భయంతో గర్భిణులు, ప్రజలు ఆధార్ కార్డులు, ఓటీపీలు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. ముఖ్యంగా పిల్లలకు టీకాలు వేసిన వెంటనే తల్లిదండ్రుల నుంచి ఝా అడగడం ఆచరణ సాధ్యం కాదని తెలిపారు. ఉద్యోగ భద్రత, వేతనాలు, కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు "సమాన పనికి సమాన వేతనం" అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు, రెగ్యులర్ ఏఎన్ఎంలకు పెండింగ్‌లో ఉన్న 12, 18 సంవత్సరాల స్పెషల్ ప్రమోషనల్ పోస్ట్ ఇంక్రిమెంట్లను వెంటనే విడుదల చేయాలని, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం అధికారులకు, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై స్పందించిన కమిషనర్, తమ పరిధిలోని సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని, మిగిలిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి ఫసియుద్దీన్, నాయకులు ఏ.కవిత, డి.కిరణ్మయి, పద్మ, పుష్పలత, సంపూర్ణ, సరోజ, స్రవంతి, జ్యోతి, సులోచన, లక్ష్మి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు



**కల్లూరు, ఆగస్టు 6 (పిసిడబ్ల్యూ న్యూస్) :**తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త, మహోన్నత విద్యావేత్త, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను కల్లూరు మున్సిపాలిటీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ దారావత్ మోహన్ నాయక్, మున్సిపల్ కమిషనర్ జి. సాయికృష్ణ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ దారావత్ మోహన్ నాయక్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన త్యాగాలు, కృషి చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, స్వాభిమానానికి ఆయన జీవితాంతం అంకితభావంతో పనిచేశారని పేర్కొన్నారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధి, రాష్ట్ర ప్రగతికి కృషి చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ జి. సాయికృష్ణ రెడ్డి మాట్లాడుతూ, ప్రొఫెసర్ జయశంకర్ విద్యావేత్తగా, ఆలోచనాపరుడిగా, ఉద్యమకారుడిగా తెలంగాణ చరిత్రలో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. ప్రజాసేవలో నిబద్ధత, నిజాయితీ, బాధ్యతతో పనిచేయడం ద్వారా ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి, పారదర్శక పాలన కోసం కృషి చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది ప్రొఫెసర్ జయశంకర్ సేవలను స్మరించుకుని, ఆయన ఆశయ సాధనకు అంకితభావంతో పనిచేయాలని సంకల్పం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు లక్కినేని రఘు, జిల్లెల్ల స్వాతి, బీరెల్లి మాధవరావు, దాసరి సుధారాణి, భుక్య రాంబాయ్, బానోత్ మారోని, కళ్యాణపు నవ్య, పెద్దబోయిన లక్ష్మీ నరసింహారావు, కిష్టంశెట్టి లక్ష్మి ఏడుకొండలు, మహమ్మద్ ఇస్మాయిల్, దార్ల చిన్నలక్ష్మి నరసింహారావు, యాసా నాగమణి శ్రీకాంత్, ఉబ్బన రాంబాబు, కనపర్తి శ్యామల, పెడకంటి కృష్ణయ్య, ఖమ్మంపాటి రాధ, గుండ్ల పుల్లారావు, సయ్యద్ రేష్మ ఇంతియాజ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పోట్రూ అర్జున్‌రావు, మున్సిపల్ అధికారులు మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది, శానిటేషన్ కార్మికులు పాల్గొన్నారు.

# బీసీలకు రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలి: సోను భాయ్

### సామాజిక న్యాయ తెలంగాణ సభను విజయవంతం చేసిన టీఆర్ఎస్ నాయకులు

### హరిబోలి డివిజన్ నాయకులు



**హైదరాబాద్ ఆగస్టు 06(పిసిడబ్ల్యూ న్యూస్):**హరి బోలి డివిజన్ ఇంచార్జ్ సోను భాయ్ ఆధ్వర్యంలో టీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై సామాజిక న్యాయ తెలంగాణ సభను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా సోను భాయ్ మాట్లాడుతూ బీసీ వర్గాలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో ఉద్యమిస్తున్న టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కల్వకుంట్ల కవిత నాయకత్వానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. సామాజిక న్యాయం సాధించడంలో బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు, సముచిత ప్రాతినిధ్యం కల్పించేందుకు జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు తగిన గుర్తింపు, గౌరవం మరియు న్యాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాల సాధన కోసం టీఆర్ఎస్ పార్టీ నిరంతరం ప్రజలతో కలిసి పనిచేస్తుందని పేర్కొన్నారు. బీసీలకు రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హరిబోలి డివిజన్‌కు చెందిన పలువురు టీఆర్ఎస్ నాయకులు, సుచిత్రసరిత, జయ, ముని, సీమా, దీపక్ ,లక్ష్మీ ,రాజు, నిఖిల్, అనిల్, వందన, ప్రగతి,రాణి, యన్షిక.మరియు అభిమానులు పాల్గొన్నారు.



# వివాహ వార్షికోత్సవ వేడుకల్లో సేవా స్ఫూర్తి.. యువశక్తి యూత్‌కు వాలీబాల్ కిట్ పంపిణీ..



**రామడుగు, ఆగస్టు 6 (పీసీడబ్ల్యూ న్యూస్):** మైత్రి గ్రూప్ ఆఫ్ చైర్మన్ డాక్టర్ కొత్త జైపాల్ రెడ్డి వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రామడుగు మండలం వేదిర గ్రామంలో యువశక్తి యూత్ క్రీడాకారులు, సభ్యులకు వాలీబాల్ కిట్‌ను ఆల్ ఇండియా రెడ్డి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భీరెడ్డి కరుణాకర్ రెడ్డి పంపిణీ చేశారు. అనంతరం యువతకు స్వీట్లు పంపిణీ చేసి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భీరెడ్డి కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ, డాక్టర్ కొత్త జైపాల్ రెడ్డి గత రెండు దశాబ్దాలుగా ప్రజాసేవలో నిబద్ధతతో కొనసాగుతూ అనేక మంది నిరుపేదలకు అండగా నిలిచారని కొనియాడారు. సమాజ సేవలో ఆయన చేస్తున్న సేవలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యువశక్తి యూత్ అధ్యక్షుడు సంపత్, మాజీ వార్డు సభ్యుడు లక్ష్మణ్, శ్రీనివాస్, తిరుపతి, శంకర్‌తో పాటు యూత్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ముర్రుపాలు బిడ్డకు తొలి రక్షణ కవచం






**నడికూడ, ఆగస్టు 6 (పిసిడబ్ల్యూ న్యూస్):**ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గురువారం నడికూడ మండలం రాయపర్తి గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుంచి 7 వరకు ప్రపంచవ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పుట్టిన గంటలోపే శిశువుకు ముర్రుపాలు (కొలస్ట్రం) ఇవ్వడం వల్ల రోగనిరోధక శక్తి పెరిగి అనేక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని వివరించారు. ప్రతి తల్లి శిశువుకు ఆరు నెలల వరకు పూర్తిగా తల్లిపాలే అందించాలని, అనంతరం పోషకాహారంతో పాటు రెండేళ్ల వరకు తల్లిపాలను కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, సునీత, సంతోష్, మాలతి, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

# గద్దర్ ఆశయాలను కొనసాగించాలి!

- రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నరసయ్య




**హనుమకొండ, ఆగస్టు 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజా యుద్ధ నౌక గద్దర్ ఆశయాలను కొనసాగించాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నరసయ్య అన్నారు. గురువారం వారి మూడవ వర్ధంతిని పురస్కరించుకొని తెలంగాణ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు వారు చేసిన సేవలు మరువ లేనివని గుర్తు చేశారు. వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. నేటి రోజుల్లో ప్రజల్లో వారి ని నాదాన్ని అన్ని ప్రజా సంఘాలు అభ్యుదయవాదులు,స్వచ్ఛంద సంస్థల అధినేతలు ఐక్యంగా ఉండి ముందుకు సాగాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెల్మకంటి దయాకర్, రాష్ట్ర అధికార ప్రతినిధి తూముల సదానందం,జిల్లా అధ్యక్షులు గొర్రె థామస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇసంపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలి: ఓపాస్ నాయకులు



**వరంగల్,ఆగస్టు 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ సిద్ధాంతకర్త, ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ 89వ జయంతి వేడుకలను విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అభ్యుదయ సంఘం (ఓపాస్), ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓపాస్ ప్రతినిధులు జయశంకర్ సార్ విగ్రహానికి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ సిద్ధాంతకర్తగా, కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా, అధ్యాపకుడిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా జయశంకర్ సార్ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే ప్రాథమిక సూత్రాలతో తెలంగాణ ఉద్యమానికి దిశానిర్దేశం చేసి, ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చడంలో ఆయన పాత్ర కీలకమని గుర్తుచేసుకున్నారు. తెలంగాణ అమాయక ప్రజలకు చైతన్యం రగిలించి, సాధించుకున్న తెలంగాణను 'బంగారు తెలంగాణ'గా మార్చుకోవడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. 'ఓపాస్' ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఇఆర్. సిద్ధోజు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ తొగిటి గురుబ్రహ్మం, సంఘం ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

# కేంద్రంలో ప్రత్యేక ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

### - అఖిల పక్ష ఓబీసీ సదస్సులో నేతల డిమాండ్



**హైదరాబాద్, ఆగస్టు 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రస్తుత పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఓబీసీల సమస్యలపై చర్చించి పరిష్కరించే విధంగా చూడాలని ఓబీసీ అఖిల పక్ష జాతీయ సదస్సులో నేతలు డిమాండ్ చేశారు. జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, బీసీ రిజర్వేషన్ల సాధన సమన్వయ జేఏసీ చైర్మన్ దుంద్ర కుమారస్వామి అధ్యక్షతన గురువారం కాచిగూడలో ఓబీసీల అఖిల పక్ష జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని అన్నారు. ప్రస్తుత పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఓబీసీల హక్కులు, రాజ్యాంగ బద్ద రిజర్వేషన్లు, సామాజిక న్యాయం వంటి అంశాలపై సమగ్ర చర్చ జరపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గత 50 సంవత్సరాలుగా బీసీలు న్యాయమైన డిమాండ్ల కోసం నిరంతరం ఉద్యమాలు చేస్తున్నప్పటికి కేంద్ర ప్రభుత్వం బీసీల సంక్షేమానికి తగిన ప్రాధాన్యం లభించడం లేదని విమర్శించారు. జనగణనలో ప్రత్యేక ఓబీసీ వివరాలకు స్థానం కల్పించాలని కోరారు. 'రిజర్వేషన్ల హటావో' పేరిగ జరుగుతున్న కుట్రలను సమిష్టిగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఓబీసీ నేతలు రాజేష్ యాదవ్, బాలకృష్ణ, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్





**కరీంనగర్ ఆగస్టు 06(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త, మార్గదర్శకులు, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనకు జీవితాంతం అంకితభావంతో కృషి చేసిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ గారి జయంతి సందర్భంగా కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ప్రొఫెసర్ జయశంకర్ గారి ఆలోచనలు, ఉద్యమ స్ఫూర్తి, త్యాగం చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనే తన జీవిత ధ్యేయంగా భావించి, ఆ లక్ష్య సాధన కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడిగా జయశంకర్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. తెలంగాణ సమాజానికి ఆయన అందించిన సేవలు భావితరాలకు ఆదర్శప్రాయమని మేయర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వంగల పవన్, గొట్టిముక్కల వెంకటరమణ, జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు శ్రీ రామోజు రవీంద్రాచారి, శ్రీమంతుల సదాశ్రీ, తిప్పారపు శ్రీనివాస్, గద్దె జగదీశ్వరాచారి, కట్ట రవీందర్, కనపర్తి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపల్లిలో గ్రామ బాలల పరిరక్షణ కమిటీ సమావేశం.. బాలల రక్షణే ప్రథమ ప్రాధాన్యత...



**తిమ్మాపూర్ ఆగస్టు 6(పిసిడబ్ల్యూ న్యూస్):** తిమ్మాపూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ శోభారాణి అధ్యక్షతన గురువారం "గ్రామ బాలల పరిరక్షణ కమిటీ" సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో బాలల సంక్షేమం, భద్రతకు సంబంధించి పలు కీలక అంశాలపై చర్చించి, అధికారులకు, కమిటీ సభ్యులకు తగు సూచనలు చేశారు. 0 నుండి 18 సంవత్సరాల వయస్సు గల బాలబాలికలకు మెరుగైన రక్షణ, సంరక్షణ సేవలను అందించడం. సెమీ-అర్బన్ ప్రాంతాలు మరియు అనాథ (ఆర్ఫన్) పిల్లల సమగ్ర డాటా సేకరణ చేపట్టడం. బాల్య వివాహాలు జరగకుండా కట్టడి చేయడం., గ్రామంలో బాల కార్మికులు భిక్షాటన చేయించే పిల్లలు ఎవరూ లేకుండా చూడటంతో పాటు, బడి బయట ఉన్న (డ్రాప్-అవుట్) పిల్లలను మళ్లీ బడిలో చేర్పించేలా గ్రామ బాలల పరిరక్షణ కమిటీ ప్రత్యేక చొరవ తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ పద్మ, మిషన్ వాత్సల్య అధికారి సాదినేని రమేష్, పోషణ్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ ప్రణీత, పల్లె దవాఖాన డాక్టర్ జవేరియా, ప్రధానోపాధ్యాయులు ఉమా, అంగన్వాడీ టీచర్ అరుంధతి, ఆశా కార్యకర్తలు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు

### - విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



**కల్లూరు, ఆగస్టు 6 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రంలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కళాశాలలో ఇంటర్మీడియట్ అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్ ధరత్ మోహన్, వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వేముల శేఖర్, 15వ వార్డు కౌన్సిలర్ యాసా నాగమణి శ్రీకాంత్, కౌన్సిలర్ దాసరి సుధారాణి, కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోట్రు అర్జున్ రావు, కల్లూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ బాజీ, బొల్లం ఉపేందర్, కళాశాల అధ్యాపక బృందం కువ్వారపు శ్రీనివాసరావు, షకీలా, భాను, పుల్లారావు, వరలక్ష్మి, రంజిత్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా సాయిని మల్లేశం

### - కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కి,పార్టీ చీఫ్ రామచంద్రరావుకి అధిష్టానానికి ప్రత్యేక కృతజ్ఞతలు..



**కరీంనగర్ ఆగస్టు 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జిల్లా అధ్యక్షుడిగా తనకు బాధ్యతలు అప్పగించడం పట్ల సాయిని మల్లేశం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ , పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు , జాతీయ నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తన నియామకానికి సహకరించిన జిల్లా , రాష్ట్ర స్థాయి నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, జిల్లాలో బీజేపీని మరింత బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని సాయిని మల్లేశం స్పష్టం చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆశయాలకు, వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా పార్టీని ముందుకు తీసుకెళ్లేందుకు తగిన కార్యాచరణతో అందరి సహాయ సహకారాలతో ముందుకెళ్తామని తెలిపారు. అలాగే తనకు అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీజేపీ కుటుంబ సభ్యులందరికీ ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## చినుకు పడితే చాలు... ఎస్సీ కాలనీ జలమయం..!

### డ్రైనేజీ లేక దుర్భర జీవనం... వర్షం వస్తే ఇళ్లలోనే వరద

### ప్రభుత్వాలు మారినా... కాలనీ తలరాత మారలేదు..!



**కల్లూరు, ఆగస్టు 6 (పిసిడబ్ల్యూ న్యూస్) :** చినుకు పడితే చాలు... యర్రబోయినపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీ ప్రజల గుండెల్లో గుబులు మొదలవుతుంది. రోడ్డంతా నీటితో నిండిపోవడంతో అది కాలనీనా... కాలువనా అనే పరిస్థితి నెలకొంటోంది. భారీ వర్షాలు కాదు... తుఫానులు కాదు... కేవలం చిన్నపాటి వర్షానికే కాలనీ మొత్తం జలమయమై ఇళ్లలోకి వరదనీరు చేరుతోంది. మరి భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి ఎలా ఉంటుందోనని కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, ఇళ్లు రోడ్ల కంటే లోతట్టు ప్రాంతంలో ఉండడం వల్ల వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక నేరుగా ఇళ్లలోకే చేరుతోంది. రాత్రివేళ వర్షం కురిస్తే కుటుంబ సభ్యులంతా నిద్ర మానేసి నీటిని తోడుకుంటూ జాగారం చేయాల్సిన దుస్థితి నెలకొంది. చిన్నారులు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల భయం వెంటాడుతోంది. మురుగు నీరు నిల్వ ఉండడంతో దోమలు విజృంభించి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించే అధికారులకు, ముందస్తు చర్యలు ఎందుకు గుర్తుకు రావడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ సమస్య నిన్న మొన్నటి కాదు... ఎన్నో ఏళ్లుగా కొనసాగుతోంది. పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ అధికారులు, మండల అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదని కాలనీవాసులు చెబుతున్నారు. సమస్య చెప్పినప్పుడు వచ్చి పరిశీలించడం... ఫొటోలు తీసుకోవడం... హామీలు ఇవ్వడం... ఆ తర్వాత పూర్తిగా మరిచిపోవడం పరిపాటిగా మారిందని విమర్శిస్తున్నారు. ఈ సమస్యకు కోట్ల రూపాయలు అవసరం లేదని, సరైన డ్రైనేజీ నిర్మించి వర్షపు నీటిని బయటకు మళ్లిస్తే శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్థానికులు చెబుతున్నారు. అయినా అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ప్రశ్నకు సమాధానం లేకుండాపోయింది. ఎన్నో ప్రభుత్వాలు మారాయి... అధికారులు మారారు... కానీ కాలనీ తలరాత మాత్రం మారలేదు. ప్రజల ఇబ్బందులు అధికారుల కళ్లకు కనిపించడం లేదా..? లేక కనిపించినా పట్టించుకోవడం లేదా...? ప్రజల ప్రాణాల కంటే అధికారుల నిర్లక్ష్యమే పెద్దదా..? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి కాలనీలో శాశ్వత డ్రైనేజీ నిర్మాణం చేపట్టి సమస్యకు పూర్తి స్థాయిలో పరిష్కారం చూపాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే చిన్నపాటి వర్షానికే మునిగిపోతున్న ఈ కాలనీ పరిస్థితిపై ప్రజల్లో మరింత అసంతృప్తి వ్యక్తమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికార యంత్రాంగం మేల్కొంటుందా...? లేక మరో వర్షం... మరో వరద... మరో హామీతోనే సరిపెడుతుందా...? చూడాలి ఏం జరుగుతుందో.

## కరీంనగర్ సమగ్ర అభివృద్ధే లక్ష్యం: రాష్ట్ర ఉన్నతాధికారులతో మేయర్ కొలగాని శ్రీనివాస్ విస్తృత స్థాయి సమావేశాలు

### సీడీఎంఏ, ప్రధాన కార్యదర్శి, డీటీసీపీ, ఈఎన్‌సీ అధికారులకు నగర అభివృద్ధి ప్రణాళికలపై వినతులు





**కరీంనగర్ ఆగస్టు 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరాన్ని ఆధునిక, ప్రణాళికాబద్ధమైన, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కలిగిన ఆదర్శ నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ హైదరాబాద్‌లోని మున్సిపల్ పరిపాలన శాఖ కార్యాలయాల్లో రాష్ట్ర ఉన్నతాధికారులతో వరుసగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిపాలన శాఖ ప్రధాన కార్యదర్శి, కమిషనర్ & డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (జణహీా) డా. టి.కె. శ్రీదేవి, ×ూూతో పాటు డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (ఱజూ), ఇంజినీర్-ఇన్-చీఫ్ (జుచీజ) తదితర ఉన్నతాధికారులను కలిసి కరీంనగర్ నగర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. మేయర్ నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు అవసరమైన ప్రత్యేక నిధులు, పరిపాలనా అనుమతులు, సాంకేతిక సహకారం అందించాలని కోరారు. సమావేశంలో ముఖ్యంగా నగరంలోని ఆర్ & బీ రోడ్లకు అత్యవసర ప్యాచ్‌వర్క్, పునరుద్ధరణ పనులు, తీగలగుట్టపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని వేగవంతం చేయడం, అప్రోచ్ రోడ్లు, కల్వర్టుల నిర్మాణం, విలీన గ్రామాలకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి పైప్‌లైన్లు, వీధి దీపాలు, పారిశుధ్య వసతులు, స్టార్మ్ వాటర్ డ్రైనేజీ వ్యవస్థ విస్తరణ, లోతట్టు ప్రాంతాల్లో వరద నివారణ చర్యలు, స్మార్ట్ సిటీ మరియు యూఐడీఎఫ్ పనులను వేగవంతం చేయడం, ప్రధాన జంక్షన్ల అభివృద్ధి, ట్రాఫిక్ నిర్వహణ, పట్టణ సుందరీకరణ వంటి అంశాలను ప్రస్తావించారు. అదేవిధంగా టౌన్ ప్లానింగ్ విభాగాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని వివరించిన మేయర్, ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, అక్రమ నిర్మాణాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, భవిష్యత్ నగర విస్తరణను దృష్టిలో ఉంచుకొని సమగ్ర మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని డీటీసీపీ అధికారులను కోరారు. ఇంజినీరింగ్ విభాగంలో సూపరింటెండింగ్ ఇంజనీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్, జూనియర్ ఇంజనీర్ తదితర ఖాళీ పోస్టులను భర్తీ చేయడంతో పాటు, అభివృద్ధి పనుల అమలు వేగవంతం చేసేందుకు అవసరమైన సాంకేతిక సిబ్బందిని నియమించాలని ఈఎన్‌సీ దృష్టికి తీసుకెళ్లారు. విలీన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, అక్కడ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, పార్కులు, కమ్యూనిటీ హాళ్లు, శ్మశాన వాటికలు, విద్యుత్ వీధి దీపాలు వంటి సౌకర్యాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రధాన జంక్షన్ల అభివృద్ధి, రహదారుల విస్తరణ, ఆధునిక ట్రాఫిక్ నిర్వహణ చర్యలకు అవసరమైన అనుమతులు, నిధులు అందించాలని కూడా మేయర్ విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ నగరాన్ని రాష్ట్రంలో ఆదర్శ మున్సిపల్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని కోరిన మేయర్, నగర అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి త్వరితగతిన ఆమోదాలు మంజూరు చేయాలని అధికారులను అభ్యర్థించారు. మేయర్ సమర్పించిన ప్రతిపాదనలను అధికారులు సానుకూలంగా స్వీకరించి, సంబంధిత శాఖల సమన్వయంతో ప్రాధాన్యతా పనులను వేగవంతం చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశాలు కరీంనగర్ నగర భవిష్యత్ అభివృద్ధికి కీలక మలుపుగా నిలుస్తాయని, ప్రజల ఆశలకు అనుగుణంగా అన్ని శాఖల సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయనున్నట్లు మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు.

## తెలంగాణ రాష్ట్ర సాధనలో సుష్మా స్వరాజ్ కీలక భూమిక...

### తెలంగాణ చిన్నమ్మ సుష్మ స్వరాజ్...

### బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం....



**కరీంనగర్ ఆగస్టు 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకురాలు, కేంద్ర మాజీ విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్‌ను తెలంగాణ ప్రజలు ఎంతో ప్రేమగా 'తెలంగాణ చిన్నమ్మ' అని పిలుచుకుంటారని, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో ఆమె అందించిన అండదండలు, పార్లమెంట్‌లో ఆమె చూపిన చొరవ ఈ ప్రాంత ప్రజల గుండెల్లో ఆమెకు ప్రత్యేక స్థానం సంపాదించి పెట్టాయని, తెలంగాణ రాష్ట్ర సాధనలో సుష్మా స్వరాజ్ కీలక భూమిక పోషించారని బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం తెలిపారు. బిజెపి జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం రోజున కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో సుష్మా స్వరాజ్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం ముందుగా సుష్మా స్వరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించి మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టినప్పుడు ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ బీజేపీ తరఫున సుష్మా స్వరాజ్ తెలంగాణ వాదనను అత్యంత బలంగా వినిపించారన్నారు. ఎన్నో ఏళ్లుగా నలుగుతున్న తెలంగాణ ప్రజల ఆవేదనను అర్థం చేసుకుని, ఇచ్చిన మాట ప్రకారం పార్లమెంట్‌లో రాష్ట్ర ఏర్పాటుకు అనుకూలంగా సుష్మా స్వరాజ్ సహకరించారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. సుష్మా స్వరాజ్ 1977లో కేవలం 25 ఏళ్ల వయసులోనే హర్యానా అసెంబ్లీకి ఎన్నికై, ఆ రాష్ట్ర కేబినెట్‌లో అతి పిన్న వయస్కురాలైన మంత్రిగా రికార్డు సృష్టించారని తెలిపారు. 1998లో కొద్దికాలం పాటు ఢిల్లీకి తొలి మహిళా ముఖ్యమంత్రిగా సేవలందించారన్నారు. 15వ లోక్‌సభలో (2009-2014) ప్రతిపక్ష నాయకురాలిగా బాధ్యతలు నిర్వర్తించారని, నరేంద్ర మోదీ తొలి కేబినెట్‌లో విదేశాంగ శాఖా మంత్రిగా విశేష సేవలందించి "ప్రజల మంత్రి"గా ప్రశంసలు అందుకున్నారన్నారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో సుష్మా స్వరాజ్ అందించిన చారిత్రక సహకారాన్ని తెలంగాణ సమాజం ఎప్పటికీ మర్చిపోలేదన్నారు. ఈ కార్యక్రమం లో కార్పొరేటర్లు మాసం గణేష్, మంగళ పవన్, తోట అనిల్, టింకు బిజెపి నాయకులు మధుకర్ అన్నాడి రాజిరెడ్డి, బల్వీర్ సింగ్, కటకంలోకేష్, గుంజేటి శివ,అరిచేర్ల రాజు, మాడిశెట్టి సంతోష్, ఉప్పరపల్లి శ్రీనివాస్, అజయ్, ఈసంపల్లి మహేష్, సమరసింహారెడ్డి యువమోర్చా జిల్లా అధ్యక్షులు సంఘ నరేష్, శశి వెంకటేష్, నాగరాజ్ వినయ్, కార్తీక్ మరియు పాల్గొన్నారు.

# లిటిల్ ఫ్లవర్ సోల్జర్స్ టీమ్‌గా ప్రకటించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**-ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని యాజమాన్యాన్ని కోరిన ఎమ్మెల్యే.**

**-చూపరులను ఆకట్టుకునే విధంగా విద్యార్థుల ప్రదర్శన ఎంతో చక్కగా ఉందన్నారు**









**తొర్రూరు ప్రతినిధి,ఆగస్టు 6(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా,తొర్రూరు పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని లిటిల్ ఫ్లవర్ సోల్జర్స్ టీమ్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రసంగిస్తూ విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సేవాభావాన్ని పెంపొందించే కార్యక్రమాలు సమాజ నిర్మాణానికి ఎంతో అవసరమని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసం, సామాజిక బాధ్యతలను అలవర్చుకుని భావి భారత పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.పాఠశాల యాజమాన్యం చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అభినందిస్తూ, విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి దోహదపడే ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్, వైస్ చైర్మన్ సోమా రజిని రాజశేఖర్, పట్టణ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు..

# ప్రజాస్వామ్య పరిరక్షణకు విద్యార్థులు బాధ్యతాయుతంగా ముందుకు రావాలి

**- టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కె. విజయకుమార్ పిలుపు**



**తొర్రూరు ప్రతినిధి,ఆగస్టు 6(పిసిడబ్ల్యూ న్యూస్):** పదవ తరగతి విద్యార్థులు విద్యుత్ పాటు వ్యక్తిత్వ వికాసం పై దృష్టి సారించాలని కళాశాల ప్రిన్సిపల్ కే విజయ్ కుమార్ అన్నారు.ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో యువత, ముఖ్యంగా విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె. విజయకుమార్ అన్నారు.గురువారం కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. 10వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం, రెండో సంవత్సరం విద్యార్థులు విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలని సూచించారు.పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలంటే క్రమశిక్షణ, సమయపాలన, ఉపాధ్యాయుల సూచనలు పాటించడం ఎంతో అవసరమని చెప్పారు. చదువుతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యత, ప్రజాస్వామ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకుని ప్రతిరోజూ ప్రణాళికాబద్ధంగా చదివితే ఉన్నత విజయాలు సాధించడం సాధ్యమేనన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆశయాలను నెరవేర్చేలా కృషి చేసి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.కళాశాలలో క్రమశిక్షణతో పాటు ఉత్తమ ఫలితాల సాధనకు ప్రతి విద్యార్థి కట్టుబడి ఉండాలని ప్రిన్సిపాల్ కె. విజయకుమార్ పిలుపునిచ్చారు.

# గుర్తుర్‌లో బోనాల పండుగ తేదీని వెల్లడించిన పూజలు.

**-సుముఖత వ్యక్తం చేసిన గ్రామ సర్పంచ్ కవితా బాలకృష్ణ.**






**తొర్రూరు ప్రతినిధి,ఆగస్టు 6(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో పలు ప్రాంతాలలో బోనాల పండుగ నిర్వహిస్తున్న విషయం అందరికీ విధితమే. మహబూబాద్ జిల్లా గుర్తుర్ గ్రామపంచాయతీలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా గ్రామంలో విశ్వబ్రాహ్మణ. పూజారులు ఆగస్టు13 వ తేదీ వనభోజనాలతో పాటు బోనాల పండుగను కూడా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అదే రోజు సాయంత్రం ఎస్సీ కాలనీ నుండి బోనాలతో ముత్యాలమ్మ గుడికి చేరుకుంటారని తెలియజేశారు. 16 వ తేదీ ఆదివారం గ్రామంలోని మిగతా కులస్తులందరూ బోనాల పండుగ నిర్వహిస్తారని ప్రకటించారు. పూజారులు ఈ విషయాన్ని సర్పంచ్ కవిత బాలకృష్ణకు వివరించారు. బోనాల పండుగ సందర్భంగా ముత్యాలమ్మ గుడి ప్రాంతంలో వీధి దీపాలను ఏర్పాటు చేయాలని వారు కోరారు.

# కరీంనగర్‌లో ఘనంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు.. తల్లులకు అవగాహన సదస్సు





**కరీంనగర్ ఆగస్టు 06(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా కరీంనగర్ అర్బన్ ప్రాజెక్ట్, కోతిరాంపూర్ సెక్టార్ లక్ష్మీనగర్ అంగన్వాడీ క్లస్టర్ ఆధ్వర్యంలో తల్లులు గర్భిణీల కోసం ప్రత్యేక అవగాహనా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగాడిడబ్ల్యూఓ సరస్వతి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్టు నెలలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను అన్ని అంగన్వాడీ కేంద్రాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పుట్టిన వెంటనే గంటలోపు ముర్రుపాలు నవజాత శిశువుకు అందించాలని, అలాగే పిల్లలకు 6 నెలలు వచ్చే వరకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టించాలని స్పష్టం చేశారు. గర్భిణీలు అందరూ నార్మల్ డెలివరీ కోసం ముందు నుంచే తగిన జాగ్రత్తలు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు మరియు వ్యాయామాలు చేయాలని సూచించారు. కార్పొరేటర్లు దేవసాని సరస్వతి (38వ డివిజన్), మాసం గణేష్ (39వ డివిజన్ లు మాట్లాడుతూ : పుట్టిన మొదటి ఆరు నెలల వరకు శిశువుకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. తల్లిపాలలో శిశువుకు అవసరమైన అన్ని పోషకాలు, వ్యాధి నిరోధక శక్తిని పెంచే ప్రతిరక్షకాలు సమృద్ధిగా ఉంటాయని తెలిపారు. తల్లిపాలు తాగే పిల్లల్లో విరేచనాలు, శ్వాసకోశ వ్యాధులు, పోషకాహార లోపం వంటి సమస్యలు చాలావరకు తగ్గుతాయని వివరించారు.ఆరు నెలల తర్వాత అనుబంధ ఆహారం ప్రారంభించినప్పటికీ, రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం పాటు తల్లిపాలను కొనసాగించడం శిశువు సంపూర్ణ ఎదుగుదలకు ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. తల్లిపాలు శిశువుకే కాకుండా తల్లికి కూడా ప్రసవానంతరం త్వరగా కోలుకోవడం, అధిక రక్తస్రావం తగ్గడం, కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదం తగ్గడం వంటి ఆరోగ్య ప్రయోజనాలను చేకూరుస్తాయని వివరించారు. ఈ సందర్భంగా తల్లులలో తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగిస్తూ, ప్రతి తల్లి తన బిడ్డకు క్రమం తప్పకుండా తల్లిపాలు అందించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం ముగింపులో చిన్నారులకు అన్నప్రాసన మరియు ఉయ్యాల ఫంక్షన్ ఘనంగా నిర్వహించారు.

**పాల్గొన్న ప్రముఖులు:** 38వ డివిజన్ కార్పొరేటర్ దేవసాని సరస్వతి, 39వ డివిజన్ కార్పొరేటర్ మాసం గణేష్, డిడబ్ల్యు ఓ సరస్వతి, సిడిపిఓ కవిత, ఐ సి డి ఎస్ సూపర్‌వైజర్ ఎస్. అరుణ, చైల్డ్ లైన్ ప్రతినిధి సాయి కిరణ్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజ్ కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ ఎం.కె. బేక్, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు, తల్లులు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పీజీ కళాశాలలో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి



**కల్లూరు, ఆగస్టు 6 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ సిద్ధాంతకర్త , మేధావి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి వేడుకలు గురువారం స్థానిక యూనివర్సిటీ పీజీ కళాశాలలో డాక్టర్ టి శేఖర్ అధ్యక్షతన ఘనంగా జరిగాయి. కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది జయశంకర్ చిత్రపటానికి పూలమాలతో ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి గోపి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి పునాదులు వేసిన సిద్ధాంతకర్త, రచయిత డాక్టర్ జయశంకర్ సేవలను విద్యార్థులకు వివరించారు. ఆనాటి ముల్కీ ఉద్యమం నుండి తెలంగాణ ఉద్యమం వరకు జయశంకర్ అపారమైన కృషిచేసి తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని గణంకాలతో సహా వివరించి ఆనాటి పాలకులను ప్రశ్నించారు. ఉద్యమానికి కావలసిన సమాచారాన్ని, ప్రోత్సాహాన్ని అందించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో అపారమైన కృషి చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఆమెడ వీరన్న , డాక్టర్ వీరాంజనేయులు, డాక్టర్ గిరి ప్రసాద్, డాక్టర్ రవి బాబు, రాజీవ్ రాజ్, డాక్టర్ జగ్జీవన్ రావు, అద్దంకి తిలక్, రమ, రాణి, లక్ష్మీ హరిత, లైబ్రరీ అసిస్టెంట్ వెంకట నర్సయ్య, సూపరింటెండెంట్ శ్రీనివాస్, అమర్నాథ్, పర్చా వెంకట్, కృష్ణారావు , బీసీ సంక్షేమ సంఘం నాయకులు వెంకట రమణ, నరేందర్, వీరబాబు, విద్యార్థినీ , విద్యార్థులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలలో డ్రగ్స్ పై అవగాహన







**బెల్లంపల్లి, ఆగస్టు 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి పురస్కరించుకొని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ బాలురకళాశాలలో మంచిర్యాల జిల్లా బాధ్యులు మేరా యువభారత్ ఆధ్వర్యంలో కళాశాలలో వాలంటీర్స్ ను ఉద్దేశించి ఈవెంట్స్ నిర్వహించడం జరిగింది. నాలుగు జిల్లాల ప్రతినిధి సురేష్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్, డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి మోహన్, కాగజ్ నగర్ డిగ్రీ కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మయ్య కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రగ్ అవేర్నెస్ ప్రోగ్రాం లో భాగంగా విద్యార్థిని, విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం, గాంజాయ్, పొగాకు ధూమపానం, మద్యపానం మొదలైన విషయాలపై అవగాహన కల్పించారు. నేటి యువత డ్రగ్స్ సేవించి అనారోగ్యవారిన పడి జీవితాలు సర్వనాశనం చేసుకుంటున్నారని, దాని ఉపయోగించడం వల్ల వచ్చే అనర్థాల గురించి ఉపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్ సోమయ్య, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటర్లు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో ఘనంగా పుట్టింటి పండుగ

**- గర్భిణీలకు అంగన్వాడీ కేంద్రంలో శ్రీమంతం**



**కల్లూరు, ఆగస్టు 6 (పిసిడబ్ల్యూ న్యూస్) :**మున్సిపాలిటీ పరిధిలోని కప్పల బంధం రోడ్డు 15వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు అంగన్వాడీ ఆధ్వర్యంలో పుట్టింటి పండుగ (శ్రీమంతం) వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. 15వ వార్డు కౌన్సిలర్ యాసా నాగమణి శ్రీకాంత్ ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యాసా నాగమణి శ్రీకాంత్ మాట్లాడుతూ గర్భంతో ఉన్న మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని తెలిపారు. గర్భిణీలు, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన పోషక పదార్థాలు, ఆకుకూరలు, పాలు, గుడ్లు వంటి వాటి ప్రాముఖ్యతను వివరించారు. పుట్టింటి వాతావరణాన్ని తలపించేలా మహిళలకు ఇలాంటి సంప్రదాయ వేడుకలు నిర్వహించడం ద్వారా వారిలో మనోధైర్యం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. అంగన్వాడీ సిబ్బంది, స్థానిక మహిళలు, గర్భిణీలు పాల్గొన్నారు.



# డిసిసి కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం..

**● హాజరైన కార్యవర్గ సభ్యులు మండల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ● నేతలకు దిశా నిర్దేశం చేసిన డిసిసి అధ్యక్షులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ● జిల్లాలో SIR ను 100% పూర్తి చేయండి - డాక్టర్ మేడిపల్లి సత్యం పిలుపు ● కెసిఆర్ రాష్ట్రాన్ని 7 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారు - మేడిపల్లి సత్యం ● ఆర్థిక సంక్షోభంలోనూ రేవంత్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లతో పేదల కల నెరవేర్చింది ● ప్రతి నియోజకవర్గానికి 3500 + 2000 ఇందిరమ్మ ఇండ్లు - హైదరాబాద్‌లో 1 లక్ష ఇండ్లు ● 2 లక్షల రైతు రుణమాఫీ చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ ● 200 యూనిట్ల ఉచిత కరెంటు, 500కే గ్యాస్, మహిళలకు ఉచిత RTC - కాంగ్రెస్ ప్రభుత్వ ఘనత ● ప్రతి 15 రోజులకు ఒకసారి డిసిసి కార్యవర్గ సమావేశం: మేడిపల్లి సత్యం**





**కరీంనగర్ ఆగస్టు 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లాలో ఎస్ ఐ ఆర్ ను 100% పూర్తి చేయడంలో కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కృషి చేయాలని, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం, ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ఆరోపణలను తిప్పికొట్టడంలో పార్టీ శ్రేణులు చురుకుగా పని చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం పిలుపునిచ్చారు.నేడు చొప్పదండి ఎమ్మెల్యే జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం అధ్యక్షతన కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు మండల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులతో ఏర్పాటు చేసిన జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశానికి హాజరైన నేతలకు భవిష్యత్ కార్యాచరణ గురించి మేడిపల్లి సత్యం దిశానిర్దేశం చేసినారు.ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి మేడిపల్లి సత్యం మాట్లాడుతూ..గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో నాటి ముఖ్యమంత్రి కెసిఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని ఏడు లక్షల కోట్ల అప్పుల్లో ముంచేశారు. 2023 తర్వాత ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డి గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను కొనసాగిస్తూ ఒక విజన్ తో రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక పేదవాడు ఇల్లు కట్టుకోవడానికి 5 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేస్తూ సొంత ఇంటి కలను నిజం చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరిగింది. రెండో విడతలో మరో రెండు వేల ఇండ్లు కేటాయించడం జరిగింది. హైదరాబాద్ మహానగరంలో లక్ష ఇందిరమ్మ ఇండ్లకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది,పది సంవత్సరాలు రాష్ట్రాన్ని పరిపాలించిన కేసీఆర్ ఎనభై వేల పుస్తకాలు చదివానని తనకంటే గొప్ప మేధావి ఎవరూ లేరని చెప్పుకున్న కేసీఆర్ కనీసం తన సొంత గ్రామంలో కానీ రాష్ట్రంలో ఎక్కడ కూడా ఒక పేదవానికి ఇల్లు కట్టించిన దాఖలాలు లేవు, 200 యూనిట్ల ఉచిత కరెంటు తో గ్రామీణ ప్రాంతాల్లో 99% పేద ప్రజలు లబ్ధి పొందుతున్నారు,భారతదేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా 20వేల కోట్ల రూపాయలతో రైతులకు 2 లక్షల రుణమాఫీ చేసింది మన ప్రభుత్వం నాడు కెసిఆర్ ప్రభుత్వం వరి వేస్తే ఉరి అని చెప్పింది. కానీ మన ప్రభుత్వం సన్న వడ్లకు 500 రూపాయల బోనసిచ్చి రైతన్నలకు ఉండగా నిలిచింది, గతంలో నీళ్లు నిధులు నియామకాల విషయంలో తెలంగాణ బిడ్డలకు అన్యాయం జరుగుతుందని కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వకుండా నిరుద్యోగ యువతను రోడ్డున పడేశారు గత బిఆర్ఎస్ నిరంకుశ ప్రభుత్వంలో మనం ఒక ధర్నాకు పిలుపునిస్తే ఐదు గంటలకే పోలీసులు మన ఇంటి ముందు ఉండేవారు,నాడు ధర్నా చౌక్ ను కూడా ఎత్తేసి ఎంత ఇబ్బంది పెట్టినారో మనందరికీ తెలుసు.. ఆ ప్రభుత్వాన్ని బొంద పెట్టి ప్రజలకు స్వేచ్ఛను అందించింది కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం గడిచిన రెండున్నర సంవత్సరాలకు మించి మెరుగైన పరిపాలన ప్రజలకు అందించనుంది, బిజెపి, బి ఆర్ఎస్ వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి సోషల్ మీడియా ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రచారం చేస్తుంది,అదే సోషల్ మీడియా ద్వారా ప్రతిపక్షాలను ఎదుర్కోవడంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పదింతలు యాక్టివ్ గా ఉండాలి, రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి రోడ్లపై ధర్నాలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిందిస్తున్నారు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, 500 కే వంట గ్యాస్ సిలిండర్ ఈ విధంగా మహిళలకు సంబంధించి మన ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలతో వారు ఎంతో ఆనందంగా ఉన్నారు, మునుముందు మరిన్ని సంక్షేమ పథకాలు మహిళల కోసం మన ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది.ప్రతిపక్షాలకు గట్టి సమాధానం ఇవ్వడంలో కార్యకర్తలు చురుకుగా ఉండాలి, కాంగ్రెస్ ప్రభుత్వం పై పార్టీపై జరుగుతున్న విష ప్రచారాలను తిప్పికొట్టడంలో కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి, దేశ భవిష్యత్తు అయిన విద్యార్థులను పూర్తిగా నిర్వీర్యం చేసే కుట్ర చేసింది బిజెపి 23 లక్షల మంది నీట్ పరీక్ష రాస్తే ఆ పేపర్ లీకేజీకి పాల్పడింది బిజెపి ప్రభుత్వం మన యూపీఏ ప్రభుత్వ పాలనలో తీసుకువచ్చిన ఉపాధి హామీ చట్టం సమాచార హక్కు చట్టం ఆహార భద్రత చట్టం లాంటి ఎన్నో విప్లవత్మక చట్టాలను తీసుకువచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ రావాలని కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుంది రాహుల్ గాంధీ ప్రధాని అవతారని ప్రజలందరూ ఆశిస్తున్నారు, కాంగ్రెస్ పార్టీ మనకు ఏం చేసింది అని మాత్రమే కాకుండా కాంగ్రెస్ పార్టీకి మనం ఏమి ఇచ్చాము అనే విధంగా ఆలోచించాలి, కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు సహనం చాలా ఎక్కువగా ఉంది.. అయితే కాంగ్రెస్ పార్టీని మన ప్రభుత్వాన్ని కాపాడుకోవడంలో కొన్ని సందర్భాల్లో తీవ్రంగా ప్రతిఘటించే విధంగా సిద్ధంగా ఉండాలి, నేతల మధ్య విభేదాలు ఉండకూడదు మనమంతా ఐకమత్యంగా ఉండి కాంగ్రెస్ పార్టీ తీసుకునే ప్రతి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరుతున్నాం,ఇకనుండి ప్రతి 15 రోజులకు ఒక సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుంది, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులు జిల్లా రాష్ట్ర స్థాయి రాజకీయాలను శాసించే స్థాయికి చేరుకోవాలని కోరుకుంటున్నాం. ఒకరిటీ రెండు పనులు చేసి బిఆర్ఎస్ పార్టీ గొప్పలు చెప్పుకుంటుంది.ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేస్తున్న ప్రతి మంచి పనిని క్షేత్రస్థాయిలో ప్రజలలోకి తీసుకువెళ్లాలి ఈ విషయంలో మనం వెనుకబడి ఉన్నాం, ఈ దేశానికి స్వాతంత్రాన్ని తీసుకువచ్చిన కాంగ్రెస్ పార్టీకి పనిచేయడం అంటే ఈ దేశానికి పనిచేసినట్లుగానే భావించాలి ,ఈ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కృషి చేయాలని అన్నారు.జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులతో పాటు జిల్లాలోని మండల కాంగ్రెస్ అధ్యక్షులు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పాల్గొన్నారు.

---

## కరీంనగర్ బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన సాయిని మల్లేశం గారికి మేయర్ కొలగాని శ్రీనివాస్ శుభాకాంక్షలు



**కరీంనగర్ ఆగస్టు 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన సాయిని మల్లేశంని నేడు పార్లమెంట్ క్యాంపు కార్యాలయంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ సహచర బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సాయిని మల్లేశంని శాలువాతో ఘనంగా సత్కరించి, నూతన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.పార్టీ బలోపేతం, కార్యకర్తల సమన్వయం, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన సమర్థవంతంగా పనిచేస్తారనే విశ్వాసాన్ని మేయర్ కొలగాని శ్రీనివాస్ వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బండ రమణారెడ్డి, సోమిరెడ్డి వేణు, భూపతి రవీందర్, తోట అనిల్ ,మేకల వెంకటేష్, ఒంటెల సత్యనారాయణ రెడ్డి, బీజేపీ నాయకులు ముజీబ్, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతి సాంప్రదాయానికి ప్రతీకైనా బోనాల పండుగ




**రామడుగు, ఆగస్టు 06(పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండలంలోని గుండి గోపాల్రావుపేటలో బోనాల పండుగతెలంగాణ సంస్కృతి సంప్రదాయానికి ప్రతీకైన బోనాల పండుగను అక్షర హై స్కూల్ లో ఘనంగా నిర్వహించారు.పిల్లలు భక్తి శ్రద్ధలతో అలంకరించిన బోనాలతోహాజరయ్యారు. అబ్బాయిలు పోతరాజుల, పులి వేషాలతో డాన్స్ లు చేస్తూ ఆకట్టుకున్నారు.బోనాలు ఎత్తుకుని నృత్యాలు చేస్తూ బోనాలను పోచమ్మ కు చెల్లింపు చేశారు.బోనాల ప్రాముఖ్యతను మన తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల గురించి కరస్పాండెంట్ మినుకుల మునీందర్, డైరెక్టర్ రాధ వివరించారు.పిల్లల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమములో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తెలంగాణ రైస్ మిల్ ఇండస్ట్రీలో కలకలం.. అధికారిక సమావేశంలో అనధికారిక వ్యక్తుల పాల్గొనడంపై మిల్లర్ల అనుమానాలు..

**అవినీతిపరులపై కఠిన చర్యలకు మద్దతు.. కానీ పారదర్శకత, సమన్యాయం పాటించాలని ప్రభుత్వాన్ని కోరిన రైస్ మిల్లర్ల వర్గాలు..**



**హైదరాబాద్, ఆగస్టు 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో రైస్ మిల్ ఇండస్ట్రీకి సంబంధించి ఇటీవల సచివాలయంలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశం అనంతరం చోటుచేసుకుంటున్న పరిణామాలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వ ధాన్యాన్ని అక్రమంగా దారి మళ్లించి ప్రజాధనానికి నష్టం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు రైస్ మిల్లర్ల వర్గాలు పేర్కొన్నాయి. అయితే, ఈ చర్యల్లో పారదర్శకత, సమన్యాయం తప్పనిసరిగా ఉండాలని వారు కోరుతున్నారు.సచివాలయంలో రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ మంత్రి, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డీజీ, సివిల్ సప్లై కార్పొరేషన్ కమిషనర్ తదితర ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ధాన్యాన్ని అక్రమంగా విక్రయించి ప్రభుత్వానికి నష్టం కలిగించిన వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని, ఒక్క గింజకు కూడా లెక్క తీస్తామని మంత్రి స్పష్టం చేసినట్లు అధికారిక సమాచారం వెల్లడించింది.అయితే, ఈ సమావేశంలో ఎలాంటి అధికారిక హోదా లేని కొందరు వ్యక్తులు పాల్గొన్నారనే అంశంపై రైస్ మిల్లర్లలో తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ అత్యున్నత స్థాయి అధికారిక సమావేశంలో అనధికారిక వ్యక్తులకు అవకాశం ఎలా కల్పించారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.అలాగే, వందల కోట్ల రూపాయల అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు వ్యక్తులపై పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోకుండా, కొందరినే లక్ష్యంగా చేసుకుని తనిఖీలు నిర్వహిస్తున్నారనే అభిప్రాయం కూడా పరిశ్రమ వర్గాల్లో వ్యక్తమవుతోంది. కరీంనగర్ జిల్లాకు చెందిన ఒక రైస్ మిల్లర్‌పై అవినీతి ఆరోపణలు ఉన్నప్పటికీ ఆయన అధికారిక సమావేశంలో పాల్గొన్నట్లు ప్రచారం జరుగుతుండటంపై కూడా మిల్లర్లు వివరణ కోరుతున్నారు.చట్టాలు, ప్రభుత్వ నిబంధనలు అందరికీ సమానంగా అమలు కావాలని, నిజమైన దోషులను గుర్తించి వివక్ష లేకుండా చర్యలు తీసుకోవాలని రైస్ మిల్లర్ల వర్గాలు ప్రభుత్వాన్ని కోరాయి. నిజాయితీగా పనిచేస్తున్న మిల్లర్లకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకమైన విధానాన్ని అవలంబించాలని విజ్ఞప్తి చేశాయి.గమనిక: ఈ కథనంలో పేర్కొన్న అంశాలు రైస్ మిల్లర్ల వర్గాలు వ్యక్తం చేసిన ఆరోపణలు, అభిప్రాయాల ఆధారంగా రూపొందించబడ్డాయి. వీటిపై ప్రభుత్వం లేదా సంబంధిత అధికారుల అధికారిక స్పందన రావాల్సి ఉంది.

---

## తంగడిపల్లిలో ఘనంగా ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ 92వ జయంతి వేడుకలు

**● ముటుకులోజు దయాకర్ చారి టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చౌటుప్పల్ మున్సిపాలిటీ**

**చౌటుప్పల్:ఆగస్టు 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడిపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ ముటకులోజు దయాకరాచారి ఆధ్వర్యంలో తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ 92వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన చేసిన సేవలను, ఉద్యమానికి అందించిన స్ఫూర్తిని నాయకులు కొనియాడారు. జయశంకర్ సార్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ టీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్, 4వ వార్డు కౌన్సిలర్ ఉదరి యాదయ్య, 15వ వార్డు కౌన్సిలర్ గడ్డం ఇందిరా రాజరత్నం,

మాజీ ఉపసర్పంచ్ అరిగే కిష్టయ్య, వార్డు సభ్యులు బొడ్డు ముత్యం, ఉదరి శ్యామ్ సుందర్, 6వ వార్డు అధ్యక్షుడు రావుల ముత్యాలు, 15వ వార్డు అధ్యక్షుడు ఉదయ్ కిషోర్, 5వ వార్డు ప్రధాన కార్యదర్శి ఎండి అస్లం, మహిళా సంఘాల నాయకురాలు దేశగోని బేబీ, నిమ్మల ఆచ్చయ్య, బొంగు స్వామి, రాగిరు సత్యనారాయణ, అరిగే బీరయ్య, పరిపూర్ణ, కొయ్యడ లింగస్వామి, జిట్టా కృష్ణ యాదవ్, ఉబ్బు నరసింహ, ఉదరి మహేష్, ఉదరి సాయి పాల్గొన్నారు.



# తెలంగాణ గుండెచప్పుడు ఆచార్య జయశంకర్ సార్

**- ఆయన ఆశయాలు చిరస్మరణీయం**

**- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు ఎం. సుబ్బయ్య, తాళ్లూరి వేణు**






**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 6 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ గుండెచప్పుడు ఆచార్య జయశంకర్ సార్ అని, ఆయన ఆశయాలు చిరస్మరణీయమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు ఎం. సుబ్బయ్య, తాళ్లూరి వేణు లు అన్నారు. స్వరాష్ట్ర స్వప్న సాకారానికి జీవితాన్ని ధారపోసిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ 92వ జయంతి సందర్భంగా ఖమ్మం పెన్షనర్ల భవన్‌లో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి భావోద్వేగభరిత నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి దిశానిర్దేశాన్ని అందించిన సిద్ధాంతకర్త, ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ గొప్ప మానవతావాది, మహోన్నత దార్శనికుడని కొనియాడారు. "తెలంగాణ నేల సాధించుకున్న ఆత్మగౌరవ పోరాటానికి జయశంకర్ సార్ తొలి నుంచీ దిక్సూచిగా నిలిచారన్నారు. పల్లె పల్లెనా వికసించిన ఉద్యమ స్ఫూర్తికి ఆయన ఆలోచనలే పునాది. కోట్లాది తెలంగాణ ప్రజల దశాబ్దాల నిరీక్షణ, ఆకాంక్ష నెరవేరి స్వరాష్ట్రం సిద్ధించే సమయానికి ఆయన మన మధ్య లేకపోవడం తీరని లోటు" అని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జయశంకర్ సార్ ప్రతిపాదించిన సిద్ధాంతాలు, చూపించిన ఉద్యమ మార్గమే నేటి తెలంగాణ ఆవిర్భావానికి మూలస్తంభమని పేర్కొన్నారు. ప్రజా పోరాటంలో ఆయన అందించిన సేవలను సమాజం ఎప్పటికీ మరచిపోలేదన్నారు. ఇదే సమావేశంలో తెలంగాణ సాంస్కృతిక ఉద్యమ శిఖరం, ప్రజా గాయకుడు గద్దర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయనకు కూడా నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఉద్యమానికి ఊపిరిలూదిన ఈ ఇద్దరు మహనీయుల స్మృతులను సభ సస్మరణ పూర్వకంగా గుర్తుచేసుకుంది. జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. పూర్ణచంద్రరావు, కార్యదర్శి టి. జనార్దన్, కాజా మొయినుద్దీన్, నగర శాఖ నాయకులు యు. వెంకటేశ్వర్లు, బానోత్ వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, రామస్వామి, కోటేశ్వరరావు, ఉప్పలయ్య, ప్రసాద్ రావు తదితరులు పాల్గొని తమ శ్రద్ధాంజలి ఘటించారు.

# భూములను తప్పుడు రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారంటూ ఎమ్మెల్యేకు ఫిర్యాదు...





**రామడుగు, ఆగస్టు 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** చొప్పదండి నియోజకవర్గం పరిధిలోని రామడుగు మండలం గుండి గ్రామ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన సర్వే నంబర్లు 719/1, 728, 875/ఊ, 54/దీ, 915 మరియు ఇతర భూముల్లో చిన్నా చితకా రెవెన్యూ సమస్యలను ఆసరాగా చేసుకుని, ఎమ్మెల్యే అండ మాకు ఉంది" అని చెప్పుకుంటూ తప్పుడు రిజిస్ట్రేషన్లు చేయిస్తూ, ఉద్దేశపూర్వకంగా లిటిగేషన్లు సృష్టిస్తున్న గుండి నాగేందర్ మరియు నేరెళ్ల వెంకటి లపై చట్టరీత్యా చర్యలు తీసుకుని, క్షేత్రస్థాయి విచారణ (మొఖాఎంక్వైరీ) జరిపించి మాకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన బాధితులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ... తమ గ్రామంలోని ఎస్సీ (రాజ) సామాజిక వర్గానికి చెందిన పేద రైతులకు మరియు అనుభవదారులకు చెందిన సర్వే నంబర్లు 719/1, 728, 875/ఊ, 54/దీ మరియు 915 లలోని భూముల్లో దీర్ఘకాలంగా స్థానిక బాధితులు సాగు మరియు నివాస అనుభవంలో ఉంటున్నారని అన్నారు. అయితే ఇటీవల తమ గ్రామానికి చెందిన గుండి నాగేందర్ మరియు నేరెళ్ల వెంకటి ఇద్దరు కలిసి తాము "కాంగ్రెస్ నాయకులమని" ఎమ్మెల్యేకు అత్యంత దగ్గరి వ్యక్తులమని" చెప్పుకుంటూ, మా భూముల్లో ఉన్న చిన్న చిన్న రెవెన్యూ లోపాలను/సమస్యలను ఆసరాగా చేసుకుంటున్నారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యేగా మీ పేరును మరియు మీ అండదండలను దుర్వినియోగం చేస్తూ, క్షేత్రస్థాయిలో ఎలాంటి సాగు అనుభవం లేని వ్యక్తులతో, తప్పుడు రిజిస్ట్రేషన్లు చేయించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని చెప్పారు.వాస్తవానికి పట్టాదారులు మరియు అనుభవదారులు/బాధితులమైన మేము సామరస్యంగా చర్చించుకుని మా సమస్యలను పరిష్కరించుకోవడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, గుండి నాగేందర్ మరియు నేరెళ్ల వెంకటి ఉద్దేశపూర్వకంగా మా భూముల్లో లిటిగేషన్లు సృష్టిస్తూ, మమ్మల్ని భయాందోళనలకు గురిచేస్తూ తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.**భూములవారీగా వాస్తవపరిస్థితులు...** సర్వే నెం. 719/1: ఇందులో ఎలాంటి వ్యవసాయ సాగు లేదు. గత 50 ఏళ్లకు పైగా ఇక్కడ గట్టు, గుమ్మడి, మచ్చ కుటుంబాల నివాస ఇండ్లు, శిథిలాలు, పెరడు స్థలాలు మరియు మాల సంఘ స్థలం ఉన్నవి. పహాణీలలో కూడా వీరి పేర్లే నమోదు కాబడి ఉన్నట్లు చెప్పారు.సర్వే నెం.54/దీ: ఈ భూమిలో శిలువేరు శంకరయ్య, శీలువేరు తిరుపతి, మచ్చ లచ్చయ్య మచ్చ అంజయ్య, మచ్చ రాజయ్య, శీలువేరు సురేష్, మహీపాల్, శేఖర్ సుదీర్ఘకాలంగా ప్రత్యక్ష స్వాధీనంలో ఉంటూ సాగు/అనుభవంలో ఉన్నారని అన్నారు.సర్వే నెం. 915: ఈ భూమిలో మచ్చ లచ్చయ్య నా/శీ. లింగయ్య, మచ్చ సంపత్ నా/శీ. లచ్చయ్య, మచ్చ మల్లమ్మ ఔ/శీ. భోందయ్య, మచ్చ డేవిడ్ నా/శీ. అంజయ్య, మచ్చ క్రాంతికుమార్ నా/రా. అంజయ్య, మచ్చ రవి నా/శీ. అంజయ్య, మచ్చ నర్సయ్య నా/శీ. పోషయ్య, మచ్చ పోషయ్య నా/శీ రాజయ్య, మచ్చ రామయ్య నా/శీ. పోషయ్య, మచ్చ అంజయ్య నా/శీ. పోషయ్య, మచ్చ లచ్చయ్య నా/శీ. పోషయ్య గార్లు నిరంతరం ప్రత్యక్ష స్వాధీనం మరియు సాగు అనుభవంలో ఉన్నారని తెలిపారు.సర్వే నెం. 728: ఈ భూమి పహాణీలలో శ్రీ గుమ్మడి లింగయ్య గారి పేరు నమోదు కాబడి ఉన్నది. గత 30 సంవత్సరాలకు పైగా వారి వారసులైన గుమ్మడి శంకరయ్య మరియు గుమ్మడి సంజీవ్ గార్లు ప్రత్యక్ష సాగు అనుభవంలో ఉన్నట్లు చెప్పారు.సర్వే నెం. 875/ఊ: ఈ భూమిలో గత 30 సంవత్సరాలకు పైగా సందనవేని కొమురయ్య గారు స్వయంగా సాగు చేసుకుంటున్నారు మరియు పహాణీల ప్రకారం వారిపేరే నమోదై ఉన్నదని అన్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలను గమనించి తమరి పేరు చెప్పి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన పేద రైతులను ఇబ్బంది పెడుతున్న గుండి నాగేందర్ మరియు నేరెళ్ల వెంకటి లపై తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఎమ్మెల్యేను కోరుతున్నామని అన్నారు. అలాగే అధికారుల ద్వారా సదరు భూముల వద్ద మొఖా ఎంక్వైరీ/ క్షేత్రస్థాయి విచారణ జరిపించి, తప్పుడు దరఖాస్తులను తిరస్కరించి, మా భూములను కాపాడి మాకు తగిన న్యాయం చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ వెంటనే రామడుగు తాసిల్దారు కు మోకాపై వెళ్లి విచారణ చేపట్టాలని అన్నారు.

# నాణ్యమైన బోధనే విద్యార్థుల విజయానికి పునాది

**- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కె. రవిబాబు**

**- నూతన సిలబస్‌పై అధ్యాపకులకు జిల్లా స్థాయి శిక్షణ.. డిజిటల్ బోధన, సైన్స్ ప్రయోగాలతో విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకు కృషి చేయాలి**









**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 6 (పిసిడబ్ల్యూ న్యూస్) :** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది నాణ్యమైన బోధనేనని, నూతన సిలబస్‌ను పూర్తిగా అవగాహన చేసుకుని ప్రతి విద్యార్థికి సులభంగా అర్థమయ్యేలా బోధించడం అధ్యాపకుల ప్రధాన బాధ్యత అని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కె. రవిబాబు అన్నారు. అభివృద్ధి చెందుతున్న తెలంగాణకు సమర్థులైన యువతను తయారు చేయాలంటే బోధనలో నూతన పద్ధతులను అవలంబించాలని ఆయన సూచించారు."అభివృద్ధి చెందుతున్న తెలంగాణకు భవిష్యత్ సంసిద్ధ విద్య" అనే అంశంపై జిల్లా స్థాయి రెండు రోజుల వృత్తి నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం ఖమ్మం నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, నయాబజార్ లో బుధవారం ప్రారంభమైంది. ఆగస్టు 6, 7 తేదీల్లో జరుగుతున్న ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న 98 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఐఈఓ కె. రవిబాబు మాట్లాడుతూ... ప్రథమ, ద్వితీయ సంవత్సర ఇంటర్మీడియట్ విద్యార్థులకు నూతనంగా రూపొందించిన పాఠ్యాంశాలను కేవలం పుస్తక జ్ఞానంగా కాకుండా సులభమైన ఉదాహరణలు, ఆధునిక బోధనా పద్ధతులు, డిజిటల్ సాంకేతికత ద్వారా అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. ప్రతి విద్యార్థిలో నేర్చుకోవాలనే ఆసక్తిని పెంపొందించడం అధ్యాపకుల బాధ్యత అని పేర్కొన్నారు.తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు అందించిన డిజిటల్ బోర్డులను సమర్థవంతంగా వినియోగించి, బోధనను మరింత ఆకర్షణీయంగా, విజ్ఞానవంతంగా మార్చాలని కోరారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా విద్యార్థుల్లో అవగాహన, ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత పెరుగుతాయని తెలిపారు. ప్రత్యేకంగా సైన్స్ విద్యార్థులకు ప్రతిరోజూ ప్రయోగాత్మక బోధన నిర్వహించాలని సూచించిన ఆయన, ప్రయోగాల ద్వారా విశ్లేషణాత్మక ఆలోచన, తార్కిక దృక్పథం, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, పరిశోధనా దృక్పథం పెంపొందుతాయని వివరించారు. నూతన సిలబస్ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి అధ్యాపకుడు తన బోధనను నవీకరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణలో రసాయనశాస్త్రం, వృక్షశాస్త్రం, అర్థశాస్త్రం, చరిత్ర సబ్జెక్టులకు సంబంధించి నూతన పాఠ్యాంశాలపై అనుభవజ్ఞులైన రిసోర్స్ పర్సన్లు సమగ్ర అవగాహన కల్పించారు. బోధనలో ఎదురయ్యే సవాళు „, వాటి పరిష్కార మార్గాలు, విద్యార్థి కేంద్రిత బోధనా విధానాలపై అధ్యాపకులతో చర్చలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. ధనమ్మతో పాటు జిల్లా రిసోర్స్ పర్సన్లు కె. విజయలక్ష్మి, టి. కిరణ్ (రసాయనశాస్త్రం), సీహెచ్. వెంకటేశ్వర్లు, జె. వెంకన్న (వృక్షశాస్త్రం), బి. రామయ్య, కె. శ్రీనివాస్ (అర్థశాస్త్రం), జి. లక్ష్మయ్య, టి. శ్రీనివాస్ (చరిత్ర) పాల్గొని అధ్యాపకులకు అంశాల వారీగా శిక్షణ అందించారు.

# నేలపట్ల ఎస్సీ బాలుర హాస్టల్‌ను స్పెషల్ ఆఫీసర్‌గా పర్యవేక్షించిన మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్



**చౌటుప్పల్, ఆగస్టు 06(పిసిడబ్ల్యూ న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న 'హాస్టల్ నిద్ర' కార్యక్రమంలో భాగంగా గురువారం చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్ స్పెషల్ ఆఫీసర్‌గా సందర్శించి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా కమిషనర్ విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడి వారి విద్యాభ్యాసం, ఆరోగ్యం, వసతి సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సంక్షేమానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, ముఖ్యంగా చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని హాస్టల్ వార్డెన్ నాగ సైదులుకు సూచించారు.అనంతరం ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరానికి అందిస్తున్న నోట్‌బుక్స్, ప్లేట్లు, గ్లాసులను విద్యార్థులకు స్వయంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ క్రమశిక్షణతో చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి వసతి, సంక్షేమ పథకాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుని విద్యలో ప్రతిభ కనబరచాలని సూచించారు.

# సమస్యల పరిష్కారం కోసం బాధ్యతగా పనిచేయాలి...
# వీధిలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం..





**రామడుగు, ఆగస్టు 06(పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండల సర్వసభ్య సమావేశం మండల ప్రత్యేక అధికారి అనిల్ ప్రకాష్ అధ్యక్షతన గురువారం జరిగింది.. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరయ్యారు.. సర్పంచులుగా ఎన్నుకున్న తర్వాత మొదటిసారిగా సర్వసభ్య సమావేశం నిర్వహించడంతో సభ్యులు పలు సమస్యలపై గళం విప్పారు.. పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు అయినా ఇంకా విద్యార్థులకు యూనిఫారం ఇవ్వకపోవడం ఏంటని సర్పంచ్ నరసింగరావురావు ప్రశ్నించారు.. రామచంద్రపురం శ్రీరాములపల్లి మధ్య గ్రామాల మధ్య గల రహదారి అద్వాన్నంగా తయారయిందని బాగు చేయాలని రామచంద్రపురం సర్పంచి కడారి రాజేష్ కి సభ దృష్టికి తీసుకొచ్చారు.. గోపాల్ రావు పేట రామడుగు, బూరుగుపల్లి వరకు గల ప్రధాన రహదారి గుంతల గుంతల మేమే రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని తిరుమలాపూర్ సర్పంచ్ మోడీ రవీందర్ ఆవేదన వ్యక్తం చేశారు.. మిషన్ భగీరథ నీళ్లు సక్రమంగా రావడం లేదని.. రోజుల పాటు సరఫరా చేసిన ట్యాంకులు నిండడం లేదని లక్ష్మీపూర్ సర్పంచ్ ద్యావ అనంతరెడ్డి అన్నారు.. మిషన్ భగీరథ పైపులు దెబ్బతిని నీరు సరఫరా కాక ప్రజలు ఇబ్బంది పడుతున్న సర్దార్ అధికారులు అధికారులు సక్రమంగా స్పందించలేకపోతున్నారని దీంతో రోజుల తరబడి ఇబ్బందులు పడుతున్నామని వెదిర సర్పంచ్ అంజన్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.. దీంతో ఎమ్మెల్యే అక్కడ సమస్యను పరిష్కరించాలని ఏఈ ఆదేశించారు.. మరోసారి అలా జరుగుతే సస్పెండ్ చేయించాల్సి వస్తదని హెచ్చరించారు.. ఈ సందర్భంగా పలు సమస్యలపై సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.. దాదాపు అన్ని అంశాలపై చర్చ జరిగాక సభను ముగించాలని ఎమ్మెల్యే అధికారులను సూచించారు. అయితే మరికొన్ని శాఖలు పై చర్చ జరగాలని ముఖ్యంగా విద్యుత్ రెవెన్యూ చర్చలు ఎందుకు సాగించలేదని కోరుటపల్లి సర్పంచ్ మేకల మహేశ్వరి ఎమ్మెల్యే ని ప్రశ్నించారు.. అయితే మీకేమైనా సమస్యలు ఉంటే చెప్పండి అని ఎమ్మెల్యే అనడంతో ఆమె ఎన్ని రోజుల తర్వాత సమావేశం జరుగుతుందని చర్చ జరగాలని ఆమె కోరారు దీనికి ఎమ్మెల్యే అంగీకారం తెలిపి సమస్యలపై చర్చ జరిగిన అనంతరం సమావేశాన్ని ముగించారు.. మండలంలో అధికారులు బాగా పనిచేస్తున్నారని అదే చిన్న చిన్న సమస్యలతో కొంత అభివృద్ధి కి విగాథం కలుగుతుందని అన్నారు.. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.. గ్రామాల్లోని సమస్యలు ఉంటే తమ దృష్టికి కి తమతో పాటు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.. అధికారులు ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.. ఇప్పటివరకు నియోజకవర్గంలో 5 ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టామని 10 ఏళ్లు అధికారం లో ఉన్న గత ప్రభుత్వ ఒక ఇల్లు కూడా కట్టించిన దాటలలో లేవని విమర్శించారు.. అర్హులైన ప్రతి వ్యక్తికి ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు తమ ప్రభుత్వ హయాంలోని నిరుపేదలకు ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం,రేషన్ కార్డులు, సన్న బియ్యం ఇచ్చామని గుర్తు చేశారు.. ప్రస్తుతం ఎంతో సంక్షోభంలో ఉన్నప్పటికీ ప్రభుత్వం అభివృద్ధిలో ఏమాత్రం వెనుకంచ వేయడం లేదని అన్నారు.. సమస్యల పరిష్కారం కోసం మరోసారి ప్రత్యేకమైన సమావేశం ఏర్పాటుచేసి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఆర్డీవో, ఎంపీడీవో రాజేశ్వరి, తాసిల్దార్ రాజమల్లు, ఏఎంసీ చైర్ పర్సన్ బొమ్మర వేణి తిరుమల, సర్పంచ్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చకచకా రాకా మూవీ షూటింగ్

## మెటర్నిటీ బ్రేక్‌లో దీపికా పదుకొణె


బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె ప్రస్తుతం మాతృత్వాన్ని ఆస్వాదిస్తూ కుటుంబంతో సమయం గడుపుతున్నారు. అయితే ఆమె మెటర్నిటీ బ్రేక్ కారణంగా అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'రాకా' షూటింగ్‌కు ఆటంకం ఏర్పడుతుందనే ప్రచారం జరుగుతున్న వేళ, చిత్రబృందం అందుకు పూర్తి భిన్నంగా ముందుకు సాగుతున్నట్లు సమాచారం. సినీ వర్గాల సమాచారం ప్రకారం, దీపికా మెటర్నిటీ బ్రేక్‌ను ముందుగానే దృష్టిలో పెట్టుకుని చిత్రబృందం షూటింగ్ షెడ్యూల్‌ను ఎంతో కచ్చితంగా ఎ÷–లాన్ చేసింది. ఆమె అందుబాటులో ఉన్న సమయంలోనే ఎక్కువ భాగం సన్నివేశాలను పూర్తి చేయడంతో ప్రస్తుతం షూటింగ్ ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతోంది. దీపికా విరామంలో ఉన్న రోజుల్లో ఇతర ప్రధాన నటీనటులతో చిత్రీకరణ నిర్వహిస్తూ ఒక్క రోజు కూడా వృథా కాకుండా మేకర్స్ జాగ్రత్తలు తీసుకున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం దీపికా పదుకొణెకు సంబంధించిన షూటింగ్ దాదాపు పూర్తయినట్లు సమాచారం. చిన్న సన్నివేశాలు మాత్రమే ఉండగా, వాటిని తర్వాతి దశలో చిత్రీకరించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఆమె వ్యక్తిగత జీవితానికి, సినిమా నిర్మాణానికి మధ్య ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మేకర్స్ పక్కా ప్లానింగ్ చేసినట్లు తెలుస్తోంది. 'రాకా' సినిమాలో దీపికా పదుకొణె పాత్ర కథకు అత్యంత కీలకమని సమాచారం. ఆమె పాత్ర చుట్టూనే కథలో ప్రధాన మలుపులు తిరుగుతాయని టాక్ వినిపిస్తోంది. అందుకే షూటింగ్ ప్రారంభ దశలోనే ఆమె సన్నివేశాలకు ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేసినట్లు తెలుస్తోంది.భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'రాకా' ఒకటిగా నిలిచింది. భారీ తారాగణం, హై టెక్నికల్ స్టాండర్డ్స్, భారీ బ్జడెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. షూటింగ్ అనుకున్న షెడ్యూల్ ప్రకారమే కొనసాగుతుండటంతో, సినిమా విడుదల కూడా నిర్ణయించిన సమయానికే జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

-------------




# నవంబర్ 6న రామాయణ విడుదల

## అధికారికంగా ప్రకటించిన చిత్ర బృందం




నితీశ్ తివారీ దర్శకత్వంలో భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ'ను ప్రకటించినప్పుడే రెండు భాగాల విడుదల ఎప్పుడనేది చిత్రబృందం వెల్లడించింది. ఈ ఏడాది దీపావళి కానుకగా.. మొదటి భాగాన్ని, వచ్చే ఏడాది దీపావళికి రెండో పార్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మేకర్స్ తెలిపారు. తాజాగా మొదటి భాగం అధికారిక విడుదల తేదీని చిత్ర నిర్మాణ సంస్థ ప్రకటించింది. నవంబర్ 6న రామాయణను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు తెలుపుతూ పోస్ట్ పెట్టింది అదే రోజున రణ్‌బీర్ కుమార్తె రాహా పుట్టినరోజు కావడంతో ఈ తేదీ ఆయనకు మరింత ప్రత్యేకం కానుంది. ఇక ఈసినిమాలో మండోదరి పాత్రలో కాజల్ కనిపించనున్నారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో ఈ చిత్రం గురించి మాట్లాడారు. ఇది ఎంతో గొప్పగా రూపొందుతోందని.. ప్రపంచదేశాలకు మన సంస్కృతిని తెలియజేయడానికి రామాయణ సరైన కథ అని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందే కథలను సృష్టించగల సామర్థ్యం భారతీయ సినిమాకు ఉందని చెప్పారు. రూ.4000కోట్లతో ఈ సినిమా రూపొందుతోంది. ఇందులో రాముడిగా రణ్‌బీర్ నటించగా.. సీతగా సాయిపల్లవి, రావణుడి పాత్రలో యశ్ కనిపించనున్నారు. ఇటీవల ట్రైలర్‌ను విడుదల చేయగా అది విజువల్ వండర్‌గా యూట్యూబ్ ట్రెండిగ్‌లో నిలిచింది.

## 'వారణాసి'కి తప్పని లీకుల బెడద..

# భారీ యాక్షన్ క్లిప్ లీక్!



సూపర్ స్టార్ మహేశ్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'వారణాసి'. ఈ సినిమాకు సంబంధించిన ఓ భారీ యాక్షన్ సన్నివేశం తాలూకు వీడియో క్లిప్ ఒకటి సోషల్ మీడియాలో లీకైంది. ఆగస్టు 8న మహేశ్ బాబు పుట్టినరోజుకు కొద్దిరోజుల ముందే ఈ వీడియో బయటకు రావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వారణాసి ఘాట్స్‌లో చిత్రీకరించిన ఈ సన్నివేశంలో మహేశ్ బాబు రక్తసిక్తమైన రూపంలో కనిపిస్తున్నారు. ఈ వీడియో ఫుటేజ్ చూసి అభిమానులు ఒకవైపు ఉత్సాహంతో ఊగిపోతూనే, మరోవైపు భద్రతా వైఫల్యంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అయితే, ఈ వీడియో క్లిప్ అసలైనదేనా? కాదా? అనే విషయంపై చిత్రబృందం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఈ ప్రాజెక్టుకు లీకుల బెడద ఇదే మొదటిసారి కాదు. గతంలో సినిమా సెట్స్‌కు సంబంధించిన ఫొటోలు, కీలకపాత్రధారి పృథ్వీరాజ్ సుకుమారన్ ఫస్ట్ లుక్, చివరికి అనౌన్స్‌మెంట్ మెటీరియల్‌కు సంబంధించిన భాగాలు కూడా అధికారిక ప్రకటనకు ముందే ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమయ్యాయి. తాజా లీక్‌తో ఈ సమస్య మరోసారి తెరపైకి వచ్చింది. సెట్‌లో మరింత కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని అభిమానులు కోరుతున్నారు.రాజమౌళితో మహేశ్ బాబు చేస్తున్న ఈ తొలి చిత్రం ఒక గ్లోబ్-స్పానింగ్ అడ్వెంచర్‌గా ఉండబోతోంది. ఇందులో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. పవిత్ర నగరం కాశీలో ప్రారంభమయ్యే ఈ కథ, టైమ్ ట్రావెల్ నేపథ్యంతో అంటార్కిటికా, ఆఫ్రికా, ప్రాచీన రోమ్ వంటి ప్రాంతాలకు సాగుతుందని రాజమౌళి గతంలోనే వెల్లడించారు.ఇప్పటికే సినిమా షూటింగ్ 80 శాతం పూర్తయినట్లు సమాచారం. ప్రధాన యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ కూడా ముగిసింది. కీలక భాగాలను ఐమ్యాక్స్ కెమెరాలతో చిత్రీకరిస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం చిత్రీకరణ, పోస్ట్-ప్రొడక్షన్ పనులను ఏకకాలంలో జరుపుతూ, 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# గత సినిమాలతో గుణపాఠం నేర్చుకున్నా

## ప్రేక్షకులు ఆదరించే కథలకు ప్రాధాన్యం ఇస్తా: వరుణ్ తేజ్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ నటించిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఆయన వరుస ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన గత సినిమాల పరాజయాలపై వరుణ్ తేజ్ ఎంతో నిజాయితీగా స్పందించారు. 'మట్కా', 'ఆపరేషన్ వాలెంటైన్', 'గాండీవధారి అర్జున' వంటి చిత్రాలు ఎందుకు ఆశించిన ఫలితాన్ని అందుకోలేక పోయాయో తనదైన విశ్లేషణ చేశారు. భారీ అంచనాల మధ్య విడుదలైన 'మట్కా' సినిమాపై మొదటి నుంచే ప్రేక్షకుల్లో పెద్దగా ఆసక్తి కనిపించలేదని వరుణ్ తెలిపారు. ట్రైలర్ విడుదలైన తర్వాత వచ్చిన స్పందన చూసి, తన నుంచి ప్రేక్షకులు అలాంటి సీరియస్ కథలను ఆశించడం లేదనే విషయం అర్థమైందన్నారు. సినిమాలోని కంటెంట్ ప్రేక్షకులను థియేటర్లకు రప్పించే స్థాయిలో లేకపోవడం కూడా పరాజయానికి ప్రధాన కారణమని ఆయన అంగీకరించారు. రొటీన్‌కు భిన్నంగా కొత్త తరహా సినిమాలు చేయాలనే ఉద్దేశంతో 'మట్కా', 'గాండీవధారి అర్జున', 'ఆపరేషన్ వాలెంటైన్' వంటి చిత్రాలు చేశానని వరుణ్ చెప్పారు. అయితే ఆ సినిమాలు కేవలం ఒక వర్గం ప్రేక్షకులకు మాత్రమే నచ్చాయని, అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయాయని వెల్లడించారు. ఒక సినిమా చిన్న పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు అందరూ కలిసి చూసి ఎంజాయ్ చేయగలిగేలా ఉండాలి. ప్రేక్షకులు థియేటర్‌కు వస్తే ముందుగా వినోదాన్నే ఆశిస్తారు. ఆ బేసిక్ పాయింట్‌ను నేను మిస్ అయ్యాను అని వరుణ్ తేజ్ అన్నారు.

గత వైఫల్యాలు తనకు విలువైన పాఠాలు నేర్పాయని, ఇకపై వినోదానికి పెద్దపీట వేసే కథలను ఎంచుకుంటానని చెప్పారు. తన కొత్త చిత్రం 'కొరియన్ కనకరాజు' పూర్తి స్థాయి ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని వరుణ్ తేజ్ ధీమా వ్యక్తం చేశారు.





# కింగ్ జాకీ క్వీన్.. మూవీపై ఆసక్తికర అంశం

## అనుష్క కోసం 12 ఏళ్ల క్రితం రాసిన కథగా ప్రచారం

ఈ శుక్రవారం విడుదల కానున్న తెలుగు చిత్రాల్లో 'కింగ్ జాకీ క్వీన్ ' ఒకటి. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, ప్రచార చిత్రాలతో ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించిన ఈ పీరియాడిక్ క్రైమ్ డ్రామాపై సినీ వర్గాల్లో మంచి అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రానికి మరో ప్రత్యేకత ఏమిటంటే.. ప్రముఖ దర్శకుడు కిరణ్ కుమార్ చివరిసారిగా దర్శకత్వం వహించిన సినిమా ఇదే కావడం. దీక్షిత్ శెట్టి, శశి ఓదెల, యుక్తి తరేజా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత సుధాకర్ చెరుకూరి నిర్మించారు. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన ప్రమోషనల్ కార్యక్రమంలో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా వెల్లడించిన ఆసక్తికర విషయం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ..

దర్శకుడు కిరణ్ కుమార్ ఈ కథను దాదాపు 12 ఏళ్ల క్రితమే సిద్ధం చేశారని వెల్లడించారు. అప్పట్లో ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కించాలని భావించిన కిరణ్ కుమార్, కథానాయిక పాత్ర కోసం స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టిని దృష్టిలో పెట్టుకుని స్క్రిప్ట్ రూపొందించారట. అయితే వివిధ కారణాలతో ఆ ప్రాజెక్ట్ అప్పట్లో సెట్స్‌పైకి వెళ్లలేదు. దీంతో సినిమా నిలిచిపోయినా, దర్శకుడు మాత్రం కథను వదిలిపెట్టకుండా కాలానికి అనుగుణంగా మార్పులు చేస్తూ మరింత బలోపేతం చేశారని తెలిపారు. మొదట అనుష్క కోసం రాసిన పాత్ర, కాలక్రమేణా మార్పులు చెంది ఇప్పుడు నటి యుక్తి తరేజా పోషిస్తున్న పాత్రగా రూపుదిద్దుకుందని సమాచారం. దీంతో ఎన్నో ఏళ్లుగా దర్శకుడు మనసులో ఉన్న కథ చివరకు 'కింగ్ జాకీ క్వీన్' రూపంలో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సినిమాతో మరో ఆసక్తికర అంశం కూడా ఉంది. ప్రముఖ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సోదరుడు శశి ఓదెల ఈ చిత్రంతో హీరోగా సినీ రంగంలోకి అడుగుపెడుతున్నారు. తొలి చిత్రంతోనే పీరియాడిక్ క్రైమ్ డ్రామా వంటి విభిన్న కథను ఎంచుకోవడం ఆసక్తికరంగా మారింది.ఇక హీరో దీక్షిత్ శెట్టి కీలక పాత్రలో నటిస్తుండగా, యుక్తి తరేజా కథానాయికగా కనిపించనున్నారు.

# ది ప్యారడైజ్ టీజర్ రిలీజ్..

## ఊర మాస్ లుక్ లో విశ్వరూపం చూపించిన నాని!



నాచురల్ స్టార్ నాని, మాస్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ యాక్షన్ థ్రిల్లర్ 'ది ప్యారడైజ్'. 'దసరా' వంటి కల్ట్ బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న ఈ క్రేజీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ నుంచి తాజాగా అదిరిపోయే టీజర్ విడుదలైంది. ఇందులో నాని 'జడల్' అనే ఊర మాస్ పాత్రలో నెవర్ బిఫోర్ లుక్‌తో విశ్వరూపం చూపించారు. ప్రచార చిత్రం చూస్తుంటే బాక్సాఫీస్ వద్ద పెద్ద జాతరే జరగబోతోందని అర్థమవుతోంది... విడుదలైన టీజర్ మామూలుగా లేదు. 1980ల కాలం నాటి బ్యాక్‌డ్రాప్‌లో, సమాజంలో అణచివేతకు గురైన వర్గం తమ ఉనికి కోసం చేసే పోరాటానికి నాయకుడిగా నాని కనిపిస్తున్నారు. "ఈ దేశం ఎవరిది? ఈ జాగా ఎవరిది?" అంటూ కత్తులు పట్టుకుని నాని అరిచే అరుపులు మాస్ ఆడియన్స్‌కు ఫుల్ మీల్స్ అని చెప్పాలి. ఇక కండలు తిరిగిన దేహంతో, జడల జుట్టుతో నాని ఇంటెన్స్ అవతార్ ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెప్పిస్తోంది.టీజర్‌కి బిగ్గెస్ట్ హైలైట్ మాత్రం ఆ చివర్లో నాని చెప్పిన పవర్ ఫుల్ డైలాగ్. "ఇరుగు దృష్టి, పొరుగు దృష్టి.. నల్లి గుట్లోన్ దృష్టి, బెదురు గుట్లోన్ దృష్టి..చెడు చూపులన్నీ పోవాలి అన్నీ దూరం కావాలిథూ థూ థూ!అంటూ నాని చెప్పిన తీరు థియేటర్స్ లో పూనకాలు పుట్టించేలా వుంది. ఇక ఆ కలెక్షన్ కింగ్ మోహన్ బాబు గారి స్టైల్, డైలాగ్ చెప్తే ఎలాంటి బేస్ ఉంటుందో, సేమ్ అదే వైబ్‌తో నాని థియేటర్లలో దద్దరిల్లేలా చేశారు.